ప్రజాశక్తి

ఆదివారం 29 సెప్టెంబర్ 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన జాషువా చిత్ర కళా ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ డాక్టర్ జి.సృజన

వార్త మెయిన్‌లో

సామాజిక చైతన్యం కోసం రచనలు సాగించిన జాషువా

జయంతి సభలో మంత్రి కందుల దుర్గేష్



విజయవాడలో సిద్ధార్థ ఆడిటోరియంలో దసరా సాంస్కృతిక సంబరాల్లో బోనాల నృత్య ప్రదర్శన చేస్తున్న మహిళలు

వార్త 4లో

ఘనంగా ముగిసిన దసరా సాంస్కృతిక సంబరాలు

అలరించిన నృత్య ప్రదర్శనలు



విజయవాడలోని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వరద బాధితులు

వార్త మెయిన్‌లో

కలెక్టరేట్ వద్ద వరద బాధితుల నిరసన

● న్యాయం చేయాలని డిమాండ్ ● సిపిఎం నేతల మద్దతు

దుర్గగుడి అధికారిపై బదిలీ వేటు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దుర్గగుడిలో ప్రొవిజన్ స్టోర్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఈఓ ఎన్.రమేష్‌పై వేటు పడింది. ఆయన్ను ద్వారకా తిరుమలకు బదిలీ చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసాదాల నాణ్యత, నాసిరకం సరుకులు వినియోగంపై మీడియాలో వచ్చిన కథనాలపై స్పందించిన కమిషనర్ సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రొవిజన్ స్టోర్స్ ఏఈఓ ఎన్ రమేష్‌ను ద్వారకా తిరుమలకు బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు.

రాష్ట్రవ్యాప్తంగా చేనేత ఎగ్జిబిషన్లు : మంత్రి ఎస్.సవిత



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మంత్రి ఎస్.సవిత

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : చేనేతలకు ఆర్థిక భరోసా కల్పించేలా రాష్ట్ర వ్యాప్తంగా ఎగ్జిబిషన్లు, హ్యాండ్లూమ్ బజార్లు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖమంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయవాడ నగరంలోని పీవీపీ స్క్వేర్ మాల్ లో ఏర్పాటుచేసిన హాండ్ల్యూమ్ బజార్ ను శనివారం ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, చేనేత కార్మికులకు, పరిశ్రమ అభివద్ధి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ప్రస్తుత మార్పులకనుగుణంగా, ట్రెండ్ కు తగ్గట్లుగా చేనేత దుస్తుల తయారీలో డిజైన్లను క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో నూతన డిజైన్లు రూపొందిస్తున్నామన్నారు. ఈ డిజైన్లను చేనేత వస్త్రాల తయారీలో వినియోగించేలా నేతన్నలకు శిక్షణిస్తున్నామన్నారు. చేనేత వస్త్రాల తయారీలో నేచురల్ కలర్స్ వినియోగంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కేవలం డిజైన్లు రూపొందించడమే కాకుండా నేతన్నలు తయారు చేసే వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కూడా చంద్రబాబు ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. అంతిమంగా చేనేతలకు మేలు చేయాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు ప్రధాన లక్ష్యమన్నారు. అంతకుముందు మంత్రి సవిత...హ్యాండ్లూమ్ బజార్లు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి...ఎక్కడి నుంచి వచ్చారు...అమ్మకాలు సాగుతున్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. ఏపీతో పాటు బెంగుళూరు, చెన్నై, బికనీర్ సహా ఇతర రాష్ట్రాలకు చెందిన చేనేత కార్మికులు స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ స్టాల్ వద్ద ఆభరణాలను పరిశీలించారు. ఏ మెటీరియల్ తో తయారు చేశారో అక్కడి ఉన్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చేనేత వస్త్రాల అమ్మకాలను ప్రోత్సహించడంలో భాగంగా ఓ స్టాల్ వద్ద చేనేత చీరను మంత్రి సవిత కొనుగోలు చేశారు. చేనేత, జౌళి శాఖకమిషనర్ రేఖారాణి కూడా చీరలు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ప్రతినిధులు రంజన, సుజాత తదితరులు పాల్గొన్నారు.

చేనేత సంఘాల్లో ఎన్నికల సందడి

- **వివరాల సేకరణలో చేనేత, జౌళి శాఖ**
- **కృష్ణాజిల్లాలో 36 సంఘాలు, 5,100 మంది సభ్యులు**
- **2018 నుంచి నామినేటెడ్ కమిటీలకే పరిమితం**

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధపడుతోంది. తొలుత చేనేత సంఘాల ఎన్నికలకు జిల్లా చేనేత జౌళిశాఖ సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా అర్హత కలిగిన సంఘాలు, వాటిలో ఓటుకు అర్హత ఉన్న సభ్యుల జాబితాను తయారు చేస్తోంది. ఈనేపథ్యంలో 2018 నుంచి నామినేటెడ్ కమిటీలకే పరిమితమైన సొసైటీల్లో తాజాగా ఎన్నికల సందడి నెలకొంది.

చేనేత సంఘాల పదవీకాలం 2018తో ముగిసింది.



అప్పటి నుంచి ఎన్నికలు నిర్వహించలేదు. వైసిపి ప్రభుత్వం ఫైవ్‌మెన్ కమిటీలను ఏర్పాటు చేసింది. వాటి పదవీకాలం ఆరు నెలలకొకసారి పొడిగిస్తూ

(మిగతా 2లో)



తహశీల్దారు ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న రైతు, కౌలు రైతు సంఘాల నేతలు వై.కేశరావు, ఎం.హరిబాబు, పంచకర్ల రంగారావు, టివి.లక్ష్మణస్వామి; సదస్సులో మాట్లాడుతున్న కేశవరావు (అంతర్‌చిత్రంలో)

పంటల నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలి

- **సదస్సులో రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు**
- **ఉంగుటూరులో ప్రదర్శన**
- **తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా**

ప్రజాశక్తి - ఉంగుటూరు : గ్రామీణ ప్రాంతాల్లో వరదల కారణంగా జరిగిన నష్టంపై గణన నిర్వహించాలని, మండల, జిల్లా స్థాయి అధికార యంత్రాంగం పర్యటించి పంటను, ఇళ్లకు జరిగిన నష్టంపై సమగ్రంగా అంచనా వేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై కేశవరావు అన్నారు. కృష్ణాజిల్లా ఉంగుటూరులోని కామ్రేడ్ మానికొండ సూర్యావతి శ్రామిక భవనం ఆవరణలో రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యాన శనివారం మండల సదస్సు జరిగింది. అనంతరం వందలాది మందితో ప్రదర్శనగా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి ధర్నా నిర్వహించారు. తహశీల్దారు జె.విమలకుమారికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ముందుగా జరిగిన సదస్సులో కేశవరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పంట నష్టం తీవ్ర స్థాయిలో ఉందన్నారు. ఇంకా కొంత భూమిలో నేటికీ నీరు పోలేదని, ఫలితంగా పంటలు కుళ్లి దుర్వాసన వస్తున్నాయని చెప్పారు. కానీ నష్టం అంచనాలు మాత్రం అందుకు తగినట్లుగా లేవని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయించిన రూ.10 వేలు నష్టపరిహారం కాకుండా రైతులు పెట్టిన పెట్టుబడికి అనుగుణంగా రూ.25 వేలకు తగ్గకుండా అందించాలన్నారు. అలాగే బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని, మరో పంటకు రుణ సహాయం అందించాలని, దీనికి పూర్తిస్థాయి బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని కోరారు. ముందుగానే కౌలు చెల్లించిన రైతులకు ఆ పరిహారాన్నీ ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి వరద బాధిత రైతులను ఆదుకోవాలన్నారు. బ్యాంకుల్లో రూ.2 లక్షల వరకూ ఉన్న ప్రతి రైతు రుణాన్ని పూర్తి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆపదలో ఉన్న అన్నదాత రుణాలను మాఫీ చేయడం ప్రభుత్వాల కనీస బాధ్యతన్నారు. వరదల వల్ల అవస్థలు పడుతున్న వారికి బియ్యం, నిత్యావసర సరుకులు ప్రభుత్వం సరఫరా చేయాలని కోరారు. కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు మాట్లాడుతూ జిల్లాలో పంట నష్టపరిహారాన్ని పూర్తిస్థాయిలో సరిగా అంచనా వేయలేదన్నారు. వాస్తవ కౌలుదారుకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.వి.లక్ష్మణ స్వామి

(మిగతా 2లో)



డ్రైనేజిని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

అవుట్‌ఫాల్ డ్రైన్లను క్లీన్ చేయండి

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ

మురుగునీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరచడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. శనివారం 46వ డివిజన్లో గల మిల్ ప్రాజెక్ట్ వద్ద ఉన్న అవుట్ఫాల్ డ్రైవ్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిషనర్ మాట్లాడుతూ... నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా చూసుకోవాలని అందుకు నిరంతరం తగు చర్యలు తీసుకుంటూ ఉండాలని అధికారులను ఆదేశించారు. విజయవాడ నగర పరిధిలో ఉన్న అన్ని అవుట్ఫాల్ డ్రైనలలో నీటి ప్రవాహంలో ఎక్కడ ఆటంకం లేకుండా చూసుకోవాలని ప్రతి సర్కిల్ పరిధిలో ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వాటిని నిరంతరం పర్యవేక్షిస్తుండాలని అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య విభాగం ఇంజనీరింగ్ విభాగం ఇద్దరి సమన్వయంతో నిత్యం మేజర్, మైనర్, మీడియం, డ్రైన్లలను పరిశుభ్రపరుస్తుండాలని, మ్యాప్ ల సహాయంతో మైనర్ డ్రైన్ ల క్లీనింగ్ పర్యవేక్షిస్తుండాలని, దానికనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నావళి, సూపరిండెంట్ ఇంజనీర్ రామ్మోహన్, జోనల్ కమిషనర్ వన్ రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.ఎస్.ఎన్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌కు అవార్డు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులోని వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మణ్‌రావు ఒడిస్సా రాజధాని భువనేశ్వర్‌లోనిఉత్కల్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 26 నుండి 28 వరకు జరిగిన 27వ ఆప్టికాన్ 2024 పాల్గొని ఉత్తమ ఓరల్ ప్రజెంటేషన్‌ను సాధించారు. ఆప్టికాన్ 2024 అనేది ఫార్మసీ అధ్యాపకులకు ప్రతి సంవత్సరం అఖిల భారత ఫార్మసీ అధ్యాపకుల సంఘం వారు నిర్వహిస్తారు. అందులో ఫార్మాసిటికల్ ఎనాలసిస్ విభాగంలో డాక్టర్ ఏ లక్ష్మణరావు అధిక రక్త పీడనంకు వినియోగించే నిఫీడపిన్ అంచనా వేసే పద్ధతులపై ఓరల్ ప్రజెంటేషన్ అందించి ఉత్తమ ఓరల్ ప్రెసెంటేషన్ అవార్డును గెలుచుకున్నారు. అవార్డు ఏపీటిఐ అధ్యక్షులు మిలింద్ జే ఉమేకర్, ఆప్టికన్ 2024 సదస్సు కార్యదర్శి



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మణ్‌రావు

డాక్టర్ మిహీర్ కుమార్‌కర్ చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు గ్రహీతకు ప్రశంసా పత్రం, మెమెంటో బహుకరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ను కళాశాల చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, సెక్రటరీ వి సత్యనారాయణ, కో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వి రామకష్ణ, అధ్యాపకులు డాక్టర్ ఎస్కే అమీనాభి, డాక్టర్ పి రవిష, డాక్టర్ టీ ప్రశాంతి, డాక్టర్ టీ బాలకష్ణ, బి సత్య శ్రీ టి శ్రావణి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



ప్రజాశక్తి - వన్‌టౌన్ : గొల్లపూడి మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎంలను భద్రపరిచిన గోదామును శనివారం జిల్లా కలెక్టర్ డా. జి.సజన సాధారణ తనిఖీలలో భాగంగా పరిశీలించారు. గోడౌన్‌కు వేసిన సీల్డ్ లను, ఈవీఎంల రక్షణకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వివి ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను ఎన్నికల సంఘానికి పంపించవలసి ఉంటుందన్నారు. ఈవీఎం గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ నిర్వహించారు. తనిఖీలో కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరిండెంట్ ఎం. దుర్గాప్రసాద్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది ఉన్నారు.

దసరా ఉత్సవాలకు విస్తృతల ఏర్పాట్లు : ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : దసరా ఉత్సవాల ఏర్పాటల్లో ఎటువంటి లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. కమిషనర్ శనివారం ఉదయం తన పర్యటనలో భాగంగా దసరా ఉత్సవాలకు జరిగే ఏర్పాట్లను వన్ టౌన్ వినాయకుని గుడి నుండి మొదలుపెట్టి, రథం సెంటర్, కెనాల్ రోడ్ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ఉత్సవాలకు మొత్తం 26 ప్రదేశాలలో 32 లక్షల ప్యాకెట్ల త్రాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నారని, ఎనిమిది ప్రాంతాలలో 150 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు, ఆరు ప్రాంతాలలో 6 క్లాక్ రూమ్స్ ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏ ఏ ప్రదేశాలలో ప్రజలకు సౌకర్యాలు అవసరం ఉంటుందో, ఆ ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

మొదటిపేజీ తరువాయి



ఉంగుటూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న రైతులు, కౌలు రైతులు

పంటల నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలి

మాట్లాడుతూ మండలంలోని ఎలుకపాడు, ఆముదాలపల్లి, ముక్కపాడు, లంకపల్లి, ఓంద్రంపాడు తదితర గ్రామాల్లో పూర్తిస్థాయిలో నీట మునిగిన ఇళ్లకు పరిహారాన్ని అందించాలన్నారు. లంకపల్లి, ముక్కపాడు గ్రామాల్లో పూర్తిస్థాయి విచారణ జరగలేదని విమర్శించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు మాట్లాడుతూ జిల్లాలో చేతివృత్తులు చేసుకుంటూ, ఆటో కార్మికులుగా, పరిశ్రమల్లో కార్మికులుగా అనేక మంది ఉన్నారని, వాటి ద్వారా వచ్చే ఆదాయం కుటుంబాల పోషణకు సరిపోక పలు గ్రామాల్లో అనేక మంది కౌలుదారులుగా కూడా ఉన్నారని తెలిపారు. వాస్తవ బాధితులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బేతా శ్రీనివాసరావు, కడవకొల్లు రామరాజు, రైతు సంఘం జిల్లా నాయకులు సూరగాని సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు అజ్మీరా వెంకటేశ్వరరావు, వెన్నూతల గ్రామ సర్పంచ్ తెల్లాకుల వెంకట రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత సంఘాల్లో ఎన్నికల సందడి

వచ్చింది. పాలక మండలి ఉంటే ఉత్పత్తుల వ్యాపార నిర్వహణలో స్వతంత్రత ఉంటుంది. ప్రయివేటు కంపెనీల ఉత్పత్తులతో పోటీ పడి నూతన డిజైన్లతో వస్త్ర ఉత్పత్తులు చేపడతాయి. అయిఏత ఏడున్నరేళ్లుగా పాలక మండలి లేకపోవడంతో సంఘాలు కుంటుపడిపోయాయి. ఈ పరిస్థితుల్లో తాజాగా అక్టోబర్ 21న నోటిఫికేషన్ విడుదల చేసి డిసెంబర్ నాలుగో తేదీన ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారులకు సూచించింది. దీంతో ఆ శాఖ ఇందుకు అవసరమైన కసరత్తు చేస్తోంది. సంఘాలు, సభ్యుల వివరాలను సేకరించే పనిలో బిజీగా ఉంది. ఇప్పటికే ప్రాథమిక వివరాలను సేకరించింది. నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి కనీసం 30 రోజులు పనిచేసిన సంఘానికి మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తారు. జిల్లాలో ఒకప్పుడు 50 చేనేత సంఘాలున్నాయి. అయితే ప్రభుత్వాల ప్రోత్సాహకాలు సకాలంలో ఇవ్వకపోవడం, ఉత్పత్తులు గిట్టుబాటు కాకపోవడంతో 14 సంఘాలు మూతపడ్డాయి. దీంతో ప్రస్తుతం 36 సంఘాలే ఉన్నాయి. మండల కేంద్రమైన పెడనలో ఏడు, మండల కేంద్రం గూడూరులో ఆరు, ఇదే మండలంలోని రాయవరంలో ఆరు, పోలవరంలో నాలుగు, ఐదుగుళ్లపల్లిలో ఒకటి, మల్లవోలులో ఒకటి, మచిలీపట్నం రూరల్ చిన్నారంలో ఒకటి, అర్బన్‌లో రెండు, మండల కేంద్రం చల్లపల్లిలో రెండు, మొవ్వ మండలం కాజలో రెండు, గన్నవరం మండలం ముస్తాబాదలో ఒకటి ప్రస్తుతం నిర్వహణలో ఉన్నాయి. వీటిలో 5,100 మంది సభ్యులున్నారు.

ఇలా అయితే పోటీకి అర్హత కోల్పోతారు

అక్టోబర్ 21 తేదీన షెడ్యూల్ విడులయ్యాక మూడు రోజులపాటు నామినేషన్లు స్వీకరిస్తారు. ఒక్కో సొసైటీలో తొమ్మిది మంది డైరెక్టర్లను ఎన్నుకోవాలి. తప్పనిసరిగా వీరిలో ఇద్దరు మహిళా డైరెక్టర్లుండాలి. ఈ తొమ్మిది మంది డైరెక్టర్లు... సంఘ అధ్యక్షులను, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. సొసైటీల్లో డైరెక్టర్లుగా పోటీచేసే సభ్యులు తాము బ్యాంకులో తీసుకున్న రుణాల కిస్తీలు చెల్లింపులు మూడు నెలల కాలపరిమితికి మించి పెండింగ్లో ఉండకూడదు.

అప్పుల్లో చేనేత సొసైటీలు

ప్రభుత్వాల విధానాలతో చేనేత సంఘాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ఏడేళ్ల నుంచి సొసైటీలకు విడుదల చేయాల్సిన త్రిఫ్ట ఫండ్, దారం సబ్సిడీ, 25 పైసల వడ్డీ రుణాలు, పండుగల సమయంలో వస్త్రాలకు ఇచ్చే 30 శాతం రాయితీలను ప్రభుత్వాలు విడుదల చేయలేదు. దీంతో కృష్ణాజిల్లాలో సొసైటీలకు విడుదల కావాల్సిన మొత్తం బకాయిలు రూ.35 కోట్లు పెండింట్లోనే ఉన్నాయి. ఈనేపథ్యంలో ఉత్పత్తుల కొనసాగింపునకు పెట్టుబడిగా సమకూర్చుకున్న రుణాలు, వడ్డీలు సొసైటీలకు భారంగా మారింది. దీంతో ఎక్కువ సంఘాలు అప్పుల్లోనే ఉన్నాయి. ఎన్నికల నిర్వహణతోపాటు బకాయిలను విడుదల చేస్తేనే సొసైటీలు మనుగడ సాగిస్తాయని చేనేత ఉత్పత్తిదారులు చెబుతున్నారు.

క్రీడలతోనే విద్యార్థులకు అభ్యున్నతి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

ప్రజాశక్తి-గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలుత ఈ పోటీలను కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్. కిషోర్ ప్రారంభించారు. అనంతరం జరిగిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీల్లో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను మండల విద్యాశాఖ అధికారి కె. రవికుమార్ పరిచయం చేసుకుని అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ...విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతను ఇవ్వాలని చెప్పారు. క్రీడల్లో రాణించడం ద్వారా మంచి గుర్తింపుతో పాటు ఉన్నత విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయం పొందవచ్చాని తెలిపారు. నియోజకవర్గ క్రీడల ఇన్చార్జి సిహెచ్. చంద్రశేఖర్(చందు), మూడు మండలాలకు చెందిన వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీడీ క్రాంతికి సత్కారం

ఇటీవల జిల్లా స్థాయిలో ఎక్సెన్స్ అవార్డు అందుకున్న ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్ ఫీజికల్ డైరెక్టర్ ఎస్. క్రాంతిని కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కారించారు. ఎంఈఓ కె. రవికుమార్, అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్. కిషోర్, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు ఆమెకు దుశ్శాలువాలు కప్పి జ్ఞాపికను అందజేశారు. ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు సత్కరించడం అభినందనీయమని ఎంఈఓ పేర్కొన్నారు.

విమానాశ్రయంలో జగన్‌కు వీడ్కోలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ఎయిర్పోర్ట్‌కి మాజీ సీఎం జగన్ శనివారం వచ్చారు. ఎయిర్పోర్ట్ నుంచి బెంగళూరుకు వెళ్లారు. జగన్ రాకను పురస్కరించుకొని పోలీసులు ఎయిర్పోర్ట్ వద్ద భారీ భద్రతా చర్యలు చేపట్టారు. పార్టీ నాయకులు వీడ్కోలు పలికారు.

ప్రతి రైతు పంటలను నమోదు చేసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆంజనేయరావు శనివారం అన్నారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఏవైనా రాయితీలు పొందాలన్నా, అదే విధంగా ధాన్యం అమ్ముకోవాలన్నా (ఈ కేవైసీ) తప్పనిసరి అని అన్నారు. ఇప్పటివరకు 70 శాతం రైతులు పంట నమోదు చేసుకున్నారని, మిగిలిన రైతులు కూడా సోమవారం సాయంత్రం లోపు పంట నమోదు చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బుద్ధప్రసాద్, తదితరులు

దసరా ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : వచ్చే నెల మూడో తేదీ నుండి ప్రారంభమయ్యే శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించారు. ఆ దేవాలయాల కార్యనిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాస్ ఎమ్మెల్యే కార్యాలయానికి విచ్చేసి ఉత్సవాలకు విచ్చేయాలని ఆహ్వానం పలికారు. ఈ మేరకు ఉత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. టిడిపి నాయకులు బండే రాఘవ, దేవస్థానం సిబ్బంది ఏడుకొండలు, కష్ణమూర్తి పాల్గొన్నారు.

మోపిదేవికి సన్మానం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలంలోని కోసూరువారిపాలెం గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన మాజీ రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణకు నేతలు కృతజ్ఞతలు తెలిపారు. కోసూరు వారిపాలెం గ్రామ అబివృవద్ధి పనులకు మోపిదేవి వెంకటరమణ తన రాజ్యసభ నిధుల నుంచి రూ. ఐదు లక్షలు మంజూరు చేశారు. నిధులు మంజూరు చేసిన మోపిదేవి వెంకటరమణను రేపల్లెలోని గృహంలో శనివారం కోసూరువారిపాలెం ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్ బాబు, మండల నాయకులు కోసూరు శివనాగ మల్లేశ్వరరావులు మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు సన్మానించారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు లంకె మస్తాన్ పాల్గొన్నారు.

విద్యార్థుల వినూత్న ప్రదర్శనలు



మోపిదేవి మండలంలో...

ప్రజాశక్తి-మోపిదేవి : ఏదీ వ్యర్థమైనది కాదని సజనాత్మకతను జోడించి ప్రకృతిని సుందరంగా తీర్చిదిద్దుకోవచ్చని మోపిదేవి మండ ల విద్యాశాఖ అధికారి విద్యాసాగర్ అన్నారు. ఇలాంటి మంచి అలవాట్లు బాల్యం నుండే అలవర్చుకోవాలని సూచించారు శనివారం మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతాహి సేవలో భాగంగా వేస్ట్ టు ఆర్ట్ వినూత్న ప్రదర్శనను ప్రారంభించారు. ఇక్కడ విద్యార్థులు తయారు చేసిన వాటిలో ఉత్తమమైన వాటిని అక్టోబర్ 2న మచిలీపట్నం లో జరిగే ఎగ్జిబిషన్ లో ప్రదర్శిస్తారని తెలియజేశారు. ఉత్తమ ప్రదర్శన కు ఎంపికైన విద్యార్థులకు బహుమతి ప్రధానం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** స్థానిక ఎస్.ఇ. ఆర్.ఎం పాఠశాలలో శనివారం స్వచ్ఛత హి సేవలో భాగంగా వేస్ట్ టు ఆర్ట్ అనే విషయం సందర్భంగా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. మండలంలోని పలు పాఠశాలల నుండి విద్యార్థులు జీవితంలో వాడిన తర్వాత ఉపయోగపడని పనికిరావు అనే వస్తువులు, పదా ర్థాలను ఉపయోగించి, మనకు తిరిగి ఉపయోగించు కునే, అలంకరణకు ఉపయోగపడే విధంగా మెటీరియల్‌ను విద్యార్థులు తయారు చేసుకుని ప్రదర్శనకు హాజరయ్యారు. ఈ ప్రదర్శనలను మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు, ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయుల సహాయంతో తిలకించడానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ 1. జగన్మోహన రావు మరియు ఎంఈఓ2 జి.గోపాలరావు పర్యవేక్షించి, ఉత్తమ ప్రదర్శనలను ఎంపికచేశారు. విజేతలైన వీరిని అక్టోబర్ 2న మచిలీపట్నం లో జిల్లా స్థాయిలో జరిగే ప్రదర్శనకు హాజరుకావాలని అధికారులు తెలిపారు.

చౌటపల్లి పాఠశాలలో డివైఇఓ విచారణ

ప్రజాశక్తి-గుడివాడరూరల్ : గుడివాడ మండలం చౌటపల్లి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థినిని వేధింపులకు గురిచేయడంపై గుడివాడ ఉప విద్యాశాఖ అధికారిని పద్మారాణి చోటుపల్లి పాఠశాలలో బ్యాడ్ టచ్ వ్యవహారంపై విచారణ చేపట్టారు. ప్రతి విద్యార్థిని విచారించి ఉపాధ్యాయుల ప్రవర్తన ఎలా ఉంది, బాలికలతో ఎలా వ్యవహరిస్తున్నారు, మాటతీరు గురించి పూర్తి వివరాలను లిఖితపూర్వకంగా తీసుకొని ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కూడా ఉపాధ్యాయుల ప్రవర్తన పై ఆరా తీశారు.

పిడి చంద్రశేఖర్ సస్పెన్షన్

నాలుగో తరగతి బాలికను బ్యాడ్ టచ్ చేసిన వ్యవహారంలో పిడి చంద్రశేఖర్ అరెస్టు కావడంతో అతన్ని సస్పెండ్ చేశామని డివైఇఓ పద్మారాని తెలిపారు .అరెస్ట్ చేసి 24 గంటలు దాటిన వెంటనే అతని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ నుంచి వచ్చిన ఉత్తర్వులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందించామన్నారు.

బాధితురాలి కుటుంబానికి వేధింపులు

చౌటుపల్లి గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో చోటుచేసుకున్న కీచక పర్వం వ్యవహారంలో బాధిత కుటుంబానికి వేధింపులు ఎక్కువయ్యాయి. మీరు మా గ్రామంలో ఎలా బతుకుతారో చూస్తామని స్థానిక నాయకత్వం బెదిరింపులకు దిగుతున్నట్లు బాధితురాలు తల్లి ఐద్వా పట్టణ అధ్యక్ష ,కార్యదర్శులు జి ఎన్ ఎస్ కుమారి పి రజిని ఎదుట శనివారం వాపోయారు. తన ప్రాణం పోయినా పర్వాలేదు గాని తన కూతురికి అన్యాయం జరిగితే సహించేది లేదని ఆమె తేల్చి చెప్పారు. బాధితురాలు కుటుంబానికి పోలీసులు రక్షణ కల్పించాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

పద్యాల పోటీల్లో కీర్తన ప్రతిభ

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రపంచస్థాయిలో గజేంద్ర భాగవత పద్యాలు పోటీలలో మండల పరిధిలోని అశ్వరావు పాలెం ఎంపీ స్కూల్ నుండి ఏడవ తరగతి విద్యార్థిని గురువింద పల్లి కీర్తన పాల్గొన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోసూరు సముద్రాలు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత దేశ స్థాయిలో 283 మంది పాల్గొనగా ప్రపంచ స్థాయిలో గజేంద్ర రౌండులో 19 మంది సెలెక్ట్ అయ్యారన్నారు. వారికి శనివారం ప్రపంచ స్థాయిలో భాగవత పద్యాలు పోటీ నిర్వహించాలన్నారు. ఐ బాంబ్ నిర్వహిస్తున్న ఈ ప్రపంచ స్థాయి భాగవత పద్య పోటీలలో అశ్వరావు పాలెం పాఠశాల నుండి కీర్తన పాల్గొ నీ బహుమతి సాధించడంపై అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కీర్తనను అభినందించారు. గ్రామ సర్పంచ్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్ ఉప సర్పంచ్ య క్క టి నాగరాజు పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ వై బాలాజీ, కూనప రెడ్డి రాజు, వైస్ చైర్మన్ దాసినేని వెంకట మోహన రాఘవ , ఫణీంద్ర, పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని రమాదేవిలు అభినందించారు. కాగా కీర్తన తల్లి కరుణ కుమారి ఈ పాఠశాల విద్యా కమిటీ వైస్ చైర్మన్ కావడం విశేషం.



బైక్ దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-గన్నవరం : ఇద్దరు బైక్ దొంగలను అరెస్టు చేసినట్లు వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. వీరవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉమామహేశ్వరపురం గ్రామంలో 26వ తేదీన బాపులపాడు గ్రామ వీఆర్వో అయినా ఆరేపల్లి చైతన్య కుమార్ తన ఇంటి ముందు పెట్టుకున్న మోటార్ సైకిల్ ను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్లు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో ముద్దాయిలు అయినా బడుగు ప్రభు కుమార్, షేక్ నిరీక్షణ్ అనే వ్యక్తులను అదుపులోను వారి వద్ద నుంచి రెండు మోటార్ సైకిళ్ళు, ఒక సెల్ ఫోను, స్వాధీనపరచుకుని వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారిని విజయవాడ మెజిస్ట్రేట్ వద్ద హాజరపరచగా వారికి వారం రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించారని చెప్పారు.

భవన నిర్మాణ కార్మికుడు మృతి



ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామంలో చెరువు పక్కన నూతనంగా నిర్మిస్తున్న భవనం వద్ద ఛత్తీస్గడ్ రాష్ట్రానికి చెందిన బాలకృష్ణ గొండ్ (40) మొదటి అంతస్తు నుంచి కాలుజారి మృతి చెందాడు. మృతుడి బార్య సీత గోండ్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.



కాలిపోయిన పూరిల్లు

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలం అవురు పూడి గ్రామంలో శనివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నాగులపాటి వీరాస్వామి తాటాకు గృహం పూర్తిగా కాలి బూడిదయింది. అగ్ని ప్రమాదం సమయంలో ఇంటిలో ఎవరు లేనందున పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో గ్యాస్ బండ పేలి పెద్ద శబ్దం రావటంతో చుట్టుపక్కల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఇంటిలో ఉన్న ప్రతి సామాను కాలి బూడిదైంది. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అర్పివేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణ రావు అగ్నిప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలించారు.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-కంకిపాడు : అక్రమ మద్యం కలిగి ఉన్న నేపథ్యంలో కంకిపాడు మండలం తెన్నేరు గ్రామంలో నందమూరి గ్రామానికి చెందిన పెనుమత్స మహేష్, పేటేటి వంశీలను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 100 మద్యం బాటిల్స్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళీకష్ణ, కంకిపాడు ఎస్ఐ సందీప్‌లు కంకిపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా సిఐ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు చెప్పిన విషయాలు పాటించాలని, డ్రగ్స్, గంజాయి మత్తుపదార్థాలు వంటి వాటికి బానిస కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలు కలిగిఉన్నా, సేవించినా సమా చారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రతి గ్రామంలోని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, వాటి ద్వారా పర్యవేక్షణ మరింత పెంచుతామన్నారు. హైస్కూలు హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఎస్ఎంసి చైర్మన్ రాము, ఉపాద్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వరదల్లో నష్టపోయిన కార్మికులకు

వేతనంతో కూడిన సెలవులుగా పరిగణించాలి

ప్రజాశక్తి-విజయవాడ : వరదల్లో సర్వం కోల్పోయి, కట్టుబట్టలతో బయటపడిన మునిసిపల్ కార్మికులకు 12 రోజుల సెలవు దినాలను పని దినాలుగా కలిపి జీతం ఇవ్వాలని మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ డిమాండ్ చేశారు. కాశీనాథ్‌తో పాటు యూనియన్ నేతలు నగర కమిషనర్ ధ్యానచంద్రను కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాశీనాద్ మాట్లాడుతూ వరదల కారణంగా పనిలోకి రాని మునిసిపల్ కార్మికులకు 12 రోజులు వేతనంతో కూడిన సెలవులుగా ప్రకటించాలని కోరారు. రెండు, మూడు నెలల జీతాన్ని కార్మికులకు బోనస్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లులేని కార్మికులందరికీ ఇళ్ల కేటాయించాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు 45 మందికి ఇచ్చిన సోకాజ్ నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలన్నారు. మున్సిపల్ ఆప్కాస్ కార్మికులకు వరదల వల్ల పనిలోకి రాలేకపోయిన వారందరికీ ఇచ్చిన షోకాజు నోటీసులను ఉపసంహరించుకోవాలన్నారు. ప్రతి ఆదివారం ఫుల్ డే సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. శానిటేషన్, వెహికల్ డిపో, వాటర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజి, పార్కు, మలేరియా, స్ట్రీట్ లైటు సెక్షన్స్‌లో పనిచేస్తున్న కార్మికులందరూ వరద విపత్తు వలన సర్వస్వం కోల్పోయారన్నారు. వీటిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్, నాయకులు టి ప్రవీణ్, ఎం దుర్గారావు, వి సాంబులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సమగ్ర వికాసంపై సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఐటిసి సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ ఆధ్వర్యంలో 'బిగ్ ఫాంటసీస్ గివ్ వింగ్స్ టు యువర్ ఇమాజినేషన్ (పెద్ద కలలు: మీ ఊహలకు రెక్కలు తొడగండి)' అనే కార్యక్రమం శనివారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. రెవ రోహన్ డి.అల్మేడా (ప్రిన్సిపాల్, సెయింట్ జోసెఫ్ పాఠశాల) హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఐటిసి లిమిటెడ్, బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్, ఫుడ్స్ డివిజన్ హెడ్ అలీ హారిస్ షేర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంతో సాంకేతికతతో కళను మిళితం చేయడం ద్వారా పిల్లలలో సృజనాత్మకత ఊహాశక్తిని పెంపొందించటం బ్రాండ్ లక్ష్యం అని తెలిపారు.

వరద బాధితులకు విద్యార్థులు చేయూత

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : వరదలతో అతలాకుతలమైన విజయవాడకు



సహాయంగా మేము సైతం అంటూ ఆదిత్య కాలేజి విద్యార్థులు వరద బాధితులను నిత్యావసర సరుకులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ వీర్రాజు మాట్లాడుతూ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రెటరీ డాక్టర్ సుగుణ రెడ్డి పిలుపు మేరకు తమ విద్యాసంస్థలు ముందుకొచ్చినట్లు తెలిపారు. సింగ్ నగర్ పాయకపురం వంటి ప్రాంతాల్లో ఈ నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - తిరువూరు : గర్భిణీ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని తిరువూరు నగర పంచాయతీ చైర్ పర్సన్ జి.కస్తూరి బాయి అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం పౌష్టికారకాహార మాస ఉత్సవంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. **గంపలగూడెం :** గర్భిణీలు ఎప్పటికప్పుడు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. స్థానిక ఎంపిపి పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.

అలరించిన సంబరాలు

వైభవంగా ముగింపు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్, జీవన డెస్క్

విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) ఆధ్వర్యంలో గత మూడురోజులుగా దసరా సాంస్కృతికోత్సవాలు వైభవంగా జరిగాయి. 'చెడును దునుమాడుదాం.. మంచిని పెంచుదాం' అనే లక్ష్యంతో ఎంబివికె, స్టెప్ ఎ హెచ్ ఫర్ ఈక్వాలిటీ (సేఫ్), స్పృహాప్తి ఆర్గనైజేషన్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జన శిక్షణా సంస్థాన్, భారత మహిళా మండలి, ఇన్నర్ వీల్-దివాస్ ఆధ్వర్యంలో మూడురోజులపాటు జరిగిన ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఎంబివికెలోని ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. శనివారం మొగల్రాజపురంలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాల (పిబి సిద్ధార్థ) ఆడిటోరియంలోని ప్రాంగణాల్లో కోలాట దళాల కవాతు చూడచక్కగా సాగింది. మహిళలు ఎంతో కమనీయం..రమణీయం అన్నట్లు సినిమా, అభ్యుదయ, దేశభక్తి గేయాలకు లయబద్ధంగా కోలాటం ఆడారు. పదం..పదంకు కదం తొక్కుతూ సందర్భానుసారంగా నృత్యం చేస్తూ కోలాటం కర్రలను సుతిమెత్తగా మోదుతూ సాగారు. పిబి సిద్ధార్థ, శ్రీ దుర్గామల్లేశ్వరి మహిళా కళాశాల, స్టెల్లా, లయోల, కెబిఎన్, ఎస్ఆర్ఎస్‌వి బిఇడి కళాశాల, వైవి రావు కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, విమ్స్ మథర్ థెరిస్సా మహిళా నర్సింగ్ కళాశాల, త్రివేణి మహిళా కళాశాల, ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు ఇందులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్లాట్ మాట్ విభాగంలో చేసిన పలు స్కిట్లు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఇంటర్మీడియట్ ఆపై ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థినుల సంఖ్య గ్రామీణ భారతంలో చాలా తక్కువగానే ఉంటోందనీ, నిత్యం వేలాది మంది శిశువులు కడుపులో ఉండగానే హత్యకు గురౌతున్నారనీ, ఆ గండాన్ని తప్పించుకుని పుట్టినా నెలలు తిరక్కుండానే మృత్యువాకిట పడుతున్నారనే చెప్పే కళారూపాలను ప్రదర్శించారు. కోల్‌కతాలో ఓ మానవ మృగం క్రూరత్వానికి కన్నుమూసిన చిట్టితల్లికి అశ్రునివాళి, లైంగిక దాడుల నిరోధానికి ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేయాలి, ఆడపిల్లలకు రక్షణ కల్పించాలి, అత్యాచారం చేసే నిందితులను ఉరితీయాలి అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఆడవాళ్లకు కరాటే, కుంగ్‌ఫూ, బాక్సింగ్, కర్ర సాము వంటివి ఆడపిల్లలకు నేర్పిస్తే తమను తాము రక్షించుకుంటారనేది ఇక్కడ స్కిట్ల ద్వారా వివరించారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థుల చిత్రాలు







స్కిట్‌లోని ఒక సన్నివేశం



కమనీయం... రమణీయం

సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో ఏ చోట చూసినా సాంస్కృతిక శోభ శోభాయమానంగా సాక్షాత్కరించింది. కోలాటాల ప్రాక్టీస్‌లు, బృందాలు నృత్యాలు, ఏకపాత్రాభినయం కళాకారుల హావభావాల ప్రదర్శనలు, స్కిట్‌ల హోరులో యువత ఉత్సాహంగా నట విన్యాసాలు చూడముచ్చటగా సాగాయి. మూడు చోట్ల ముచ్చటగా వివిధ కళారూపాల ప్రదర్శనలు ఆహుతులను సమ్మోహనానికి గురిచేశాయి. దసరా సాంస్కృతికోత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు కె.స్వరూపరాణి, సిద్ధార్థ మహిళా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ టి విజయలక్ష్మి, సిద్ధార్థ ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత, దసరా సాంస్కృతికోత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు, ప్రముఖ రచయిత్రి కాపూరి సత్యవతి, కామేశ్వరి, ఎ పూర్ణిమ, పి.వాణి, ఉత్సవాల కమిటీ నిర్వాహకులు జి.జ్యోత్స్న, అరసవిల్లి సంధ్యారాణి, పి.విజయ తదితరులు పర్యవేక్షించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకులు తమ ప్రతిభకు పదును పెడుతూ సాగిన ప్రదర్శనలు ఇలా సాంస్కృతోత్సవాల్లో సృజనాత్మకతను ఉట్టిపడేలా చేసింది.

మద్యం షాపులను నియంత్రించాలని ధర్నా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపులను నియంత్రించాలని మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ అన్నారు. శనివారం విజయవాడ కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లో మద్యం నూతన పాలసీని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ



యధావిధిగా ప్రభుత్వమే మద్యం షాపులు నడలపాలన్నారు. ప్రైవేటుకు మద్యం షాపులు ఇస్తే అందోళన దిగ్గుతామని హెచ్చరించారు. గత ప్రభుత్వమే మద్యం అమ్మకాలు చేస్తామని చెప్పి ఆ మాటపై మద్యం అమ్మకాలు జరిగాయన్నారు. కానీ ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉన్న మద్యం షాపులు కాకుండా మరికొన్ని మద్యం షాపులు పెట్టేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే మద్యం అమ్మకాలు చేయాలని, ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకే అమ్మకాలు చేయాలన్నారు. హైవేలపై మద్యం షాపులున్నాయని చెప్పారు. ప్రభుత్వం మద్యం షాపులు నియంత్రించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు కొట్టు రమణరావు, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు కంచర్ల భార్గవ్, నగర కార్యవర్గ సభ్యులు డీ.సీతారావమ్మ, దురాసి రమణమ్మ, చింతాడ పార్వతీ, నిజాపు భాగ్యలక్ష్మి, ఏ.శాంత, ఆర్.అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతాల్లో మళ్లీ ఇంటింటి సర్వే

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కంచికచర్ల : ఇటీవల కృష్ణానదికి భారీగా వచ్చిన వరదకు మండలంలో ఇళ్లు నీట మునిగిన బాధితుల పేర్లు నమోదుకు అధికారులు ఇంటింటికి తిరిగి సర్వే చేశారు. ఈ నెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలు వరదలకు గత 50 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా కృష్ణానదికి 11.45 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిన విషయం తెలిసిందే. ముంపునకు గురైన బాధిత కూటుంబాలను రెమ్యూనరేషన్ చేయటంలో స్థానిక అధికారులకు ఉన్నతాధికారుల నుండి తగు ఆదేశాలు లేకపోవటంతో, కేవలం కొద్ది గంటలు మాత్రమే ఇళ్లల్లోకి నీరు చేరిందని ప్రభుత్వానికి నివేదిక పంపారు. నష్టపరిహారం వచ్చేలా బాధితుల పేర్లు నమోదు కాక పరిహారం అందకపోవటంతో బాధితులు అందోళన బాట పట్టారు. వరద బాధితులు నష్టపోయిన తీరుకు ప్రజాశక్తిలో పరిహారం... పరిహాసం పేరుతో శనివారం కథనం వెలువడింది. ఈ కథనానికి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం కదిలింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక తహశీల్దారు జాహ్నవి ఆధ్వర్యంలో రెవిన్యూ, పంచాయతీ అధికారులు శనివారం వరద ముంపై గ్రామాల్లో ఇంటింటికి తిరిగి నీట మునిగిన ఇళ్ల వివరాలు నమోదు చేశారు. చెవిటికల్లు, కొత్తపేట, గని ఆత్కూరు, కునికిపాడు, మున్నలూరు, మోగులూరు, వేములపల్లి, ఎస్.అమరవరం. పెండ్యాల గ్రామాల్లో ఇల్లు మూనిగిన తీరు, కొట్టుకుపోయిన వస్తువులు, పాడైపోయిన వస్తువుల వివరాలు నమోదు చేశారు. సర్వే నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తహశీల్దారు జాహ్నవి తెలిపారు.



బాధితుల వివరాలు నమోదు చేసుకుంటున్న దృశ్యం

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లిఖార్జునరావు కుటుంబసభ్యులతో కలిసి శనివారం శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయానికి విచ్చేశారు. ఆలయ ఇఇ కె.ఎస్. రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ వేదపండితులు వీరికి వేదార్వచనం చేయగా, ఆలయ ఈవో వీరికి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

బాధితులకు న్యాయం చేయాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - భవానీపురం : వరద బాధితులందరికీ న్యాయం చేయాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను పశ్చిమ నియోజకవర్గం 42వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు తిరుపతి అనూష కలిసి శనివారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వరద బాధితుల సర్వే సరిగ్గా జరగలేదని, సర్వే జరిగినా కొంతమందికి డబ్బులు పడలేదని, బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అనూష మంత్రి దుర్గేష్‌కు వివరించారు. దీనిపై రీసర్వే నిర్వహించాలని వినతిపత్రం అందజేసినట్లు తిరుపతి అనూష తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ప్రచార కమిటీ విజయవాడ అర్బన్ కో-ఆర్డినేటర్ తిరుపతి సురేష్, జనసేన పార్టీ 45వ డివిజన్ అధ్యక్షులు బొమ్ము గోవిందలక్ష్మి, 47వ డివిజన్ అధ్యక్షులు వేంపల్లి గౌరీ శంకర్, 56 డివిజన్ అధ్యక్షులు ముద్రబోయిన దేవకి పాల్గొన్నారు.

నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలి

- కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు
- నేడు పుట్టగుంటలో సదస్సు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎం. హరిబాబు

ప్రజాశక్తి - గుడివాడ : ఇటీవల బుడమేరు వరదల్లో నష్టపోయిన కౌలు రైతులకే ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం ఇవ్వాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు డిమాండ్ చేశారు. శనివారం గుడివాడ సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఈ క్రాప్‌లోను నష్టపరిహారాల్లోనూ కౌలు రైతుల్ని నమోదు చేయాలని అధికారులను కోరారు. ఇటీవల వచ్చిన వరదల వల్ల ఒక్క వడ్ల గింజ కూడా ఇంటికి వచ్చే పరిస్థితి లేదని, ఇప్పటికే 30 నుండి 35వేల రూపాయలు పెట్టుబడి పెట్టి కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అనేక గ్రామాల్లో వరదల కారణంగా ఇళ్లల్లోకి నీరు ప్రవేశించి అనేక వస్తువులు కూడా పాడైపోయాయన్నారు. కాబట్టి విజయవాడ తరహాలో గ్రౌండ్ ఫ్లోర్ లోకి నీరు వస్తే పాతికవేలు ఆపై అంతస్తులకు నీరు వస్తే పదివేలు ఇస్తానన్నది గ్రామీణ ప్రాంతాల్లో కూడా అమలు చేయాలన్నారు. అనేక గ్రామాల్లో వ్యవసాయ మోటార్లు వరదల వల్ల కొట్టుకుపోయాయని వాటన్నిటిని ఇప్పటివరకు ఎన్యూమరేషన్ చేయలేదన్నారు. అలాగే ట్రాక్టర్లు మునిగిపోయాయని, కొన్ని గ్రామాల్లో పశువులు, మేకలు, కోళ్లు వరదలకు కొట్టుకుపోయాయి కాబట్టి వీటన్నిటిని సమగ్రంగా ఎన్యూమరేషన్ చేసి బుడమేరు వరదల వల్ల నష్టపోయిన కౌలు రైతులు సన్న, చిన్నకారు రైతులు, ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఈ విషయాలను ప్రభుత్వం దష్టికి తీసుకురావడానికి ఈనెల 29వ తేదీ సాయంత్రం మూడు గంటలకు నందివాడ మండలం పుట్టగుంటలో సదస్సు నిర్వహిస్తునామన్నారు. దీనిలో కౌలు రైతులు సన్నాచిన్న కారు రైతులు ఇతర నష్టపోయినటువంటి ప్రజలు అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్‌సిపి రెడ్డి పాల్గొన్నారు.

సిమెంటు బస్తాలు వితరణ

ప్రజాశక్తి-చల్లపల్లి : స్థానిక నిమ్మలతోటలోని సీయోను వద్ధాశ్రమం ఆవరణలో నూతన ఆశ్రమ భవన నిర్మాణానికి విజయవాడకు చెందిన ఘంటా రామకృష్ణ - సత్యవాణి దంపతులు 100 సిమెంటు బస్తాలు శనివారం వితరణగా అందచేశారు. స్థానిక ప్రముఖులు దోనేపూడి రవిశంకర్ ద్వారా ఈ సహాయాన్ని ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావుకు అందించారు.



రహదారికి గండి పడిన దృశ్యం

గండి పూడ్చండి మహాప్రభో...

- చిక్కవరం రైతులు వేడుకోలు

ప్రజాశక్తి-గన్నవరం : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదకు చిక్కవరం గ్రామం నుండి కొండమోరు రహదారిలో సూర్య ఆంజనేయ దేవాలయం వెళ్ళే రహదారికి భారీ గండి పడింది. దీంతో చిక్కవరం నుండి సూర్య ఆంజనేయస్వామి దేవాలయం, కొన్ని వందల ఎకరాల పంట పొలాలకు రైతులు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న గండి అయితే గ్రామస్తులే తలో చేయి వేసుకొని పూడ్చే అవకాశం ఉంది. కానీ భారీ గండి పడటంతో గ్రామస్తులు కూడా దీన్ని పూడ్చుటం తమ వల్ల అయ్యే పని కాదంటూ వెంటనే గండిపూడ్చాలని వేడు కుంటున్నారు.

పింఛన్ల పంపిణీ సజావుగా జరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : అక్టోబరు ఒకటవ తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు, వైద్య ఆరోగ్య, వ్యవసాయ శాఖ అధికారులతో పింఛన్ల పంపిణీ, ఈ పంట నమోదు, స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ మొదటి తేదీన పింఛన్లను సజావుగా పంపిణీ చేసేందుకు ముందు రోజు వారి పరిధిలోని సచివాలయంలో తప్పనిసరిగా ఉండాలన్నారు. వారి పరిధిలోని లబ్ధిదారుల జాబితా ప్రకారం రూట్ మ్యాప్ ను రూపొందించుకొని ప్రణాళికబద్ధంగా పంపిణీ చేపట్టాలన్నారు.ఎలాంటి గందరగోళానికి గురికాకుండా ఉండేందుకు పంపిణీకి ముందు రోజే బ్యాంకుల నుంచి నగదును విత్ డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.బయట ప్రాంతాలలో ఉంటున్న లబ్ధిదారులకు ముందుగానే ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి పంపిణీ రోజున ఆ గ్రామంలో అందుబాటులో ఉండే విధంగా వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ఉదయం నాలుగు గంటల నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టి ఉదయం 10 గంటల్లోపు పూర్తి చేయాలన్నారు. ఈవీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పంచాయతీ అధికారిణి జె అరుణ పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సును పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం శ్రీకాకుళం నుంచి వయా పాపవినాశనం, గోగినేనిపాలెం, చినకళ్లేపల్లి, వేముపల్లి మీదుగా చల్లపల్లి వెళ్లటానికి ఆర్టీసీ బస్సు సర్వీసు తిరిగి ప్రారంభించాలని ఘంటసాల మండలం గోగినేనిపాలెం టీడీపీ నాయకులు కుంపటి సుబ్బారావు కోరారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఘంటసాల మండలం పాపవినాశనం, గోగినేనిపాలెం, చినకళ్లేపల్లి, వేములపల్లి గ్రామాలలో సుమారు 7 వేల మంది జనాభా నివశిస్తున్నారని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో శ్రీకాకుళం నుంచి వయా పాపవినాశనం. గోగినేనిపాలెం, చినకళ్లేపల్లి, వేములపల్లి మీదుగా చల్లపల్లి వెళ్లటానికి రోజుకు రెండు పర్యాయాలు బస్సు సర్వీసును నడిపేవారని గుర్తు చేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వంలో ఈ బస్సు సర్వీసు నిలిపివేశారని. కావున మళ్లీ ఆ సర్వీసును నడపాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్ హనుమంతరావును కోరినట్లు తెలిపారు.

తిరుమలపై రాజకీయ డ్రామలొద్దు : మంత్రి కొల్లు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : తిరుమల వెంకన్నతో నాటకాలాడితే ఊరుకునేది లేదని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. శనివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ తిరుమలపై రాజకీయ డ్రామాలా డొద్దని, డిక్లరేషన్ ఇచ్చి దర్శనం చేసుకోవాలని సూచిస్తే ఏదో జరిగిపోయినట్లు జగన్ రెడ్డి రాద్ధాంతం చేయడంపై మండిపడ్డారు. గత ఐదు సంవత్సరాలు తిరుమల ప్రతిష్టను దెబ్బతీశారని అన్నారు. అహింస గురించి పేర్ని నాని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వ్యక్తిగత విషయాల గురించి పేర్ని నాని నోరు జారే ముందు కాస్త ఆలోచించాలని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంయమనంతో ఉన్నారు. ఐదేళ్లుగా నియోజకవర్గంలో ఇళ్ల స్థలాల పేరుతో జరిగిన భూ దందాలు, భూ సేకరణ పేరుతో చేసిన దోపిడీలు, వసూల్లు, కమిషన్ల లెక్కలు తేలుస్తామని పేర్ని నానిని హెచ్చరించారు.

చల్లపల్లిలో డ్రైనేజీలు లేక ఇబ్బందులు

ప్రజాశక్తి-చల్లపల్లి : డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారు కావడంతో పల్లపు ప్రాంతాలలో నీరుచేరడంతో పరిసరాలలోని గృహస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని వెలివోలు దళితవాడలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారు కావడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు కాలనీలోని పల్లపు ప్రాంతాలలో అంతర్గత రోడ్లు నీటిలో మునగటంతో



ఇళ్ల మధ్య నిలిచిన నీరు

ఆ ప్రాంతాలలోని గహస్తులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షానికి రోడ్లు తటాకాన్ని తలపిస్తున్నాయి. ఈ నీటిలో వ్యర్ధ పదార్థాలు చేరి కుల్లటంతో దుర్గంధం వెదజల్లుతుందని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి. కుంటలలో చేరిన వ్యర్థ పదార్థాలు దోమల వద్ధికి నిలయంగా మారాయి. పగలు రాత్రి తేడా లేకుండా ప్రజలపై దోమలు దాడి చేయడంతో రోగాల బారిన పడతమేమోని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కావున పంచాయతీ పాలకులు పల్లపు ప్రాంతాలలోని నీటిని బయటకు పంపాలని కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు దోమల నివారణ మందులు పిచికారి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కవుతరం వైసిపి నాయకులు నాగమోహన్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్ల మూడి నాగమోహన్ (చిన్ని) శనివారం సాయం త్రం హైదరాబాద్‌లోని ప్రయివేటు ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. ఆయన కొండలమ్మ దేవస్థానం సభ్యునిగా, కవుతరం పిఎసిఎస్ అధ్యక్షునిగా పనిచేశారు. అంతేకాక గుడివాడ నియోజకవర్గం వైయస్సార్ పార్టీలో కీలక పాత్ర పోషించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కవుతరం గ్రామంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణం వైయస్సార్ పార్టీ తీరనిలోటుగా పలువురు భావిస్తున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వైసిపి నాయకులు కోరారు.



గుడివాడ ఆర్‌డిఒగా బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన బాలసుబ్రమ్మణ్యం బదిలీపై గుడివాడ ఆర్‌డివోగా నియమితులయ్యారు. శనివారం ఆయన ఆర్‌డివోగా బాధ్యతలను తీసుకున్నారు. తొలుత స్థానిక మొయిన్ రోడ్డులోని శ్రీ విగ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో గుడివాడ ఆర్‌డిఓ బాలసుబ్రహ్మణ్యం దంపతుల ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆర్డీవో బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ ఆంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ సేవలను ప్రజలకు నూరు శాతం అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ క్రమంలో కార్యాలయ సిబ్బంది నూతన ఆర్డీవో బాలసుబ్రమణ్యంకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



ఆర్‌డివోగా బాధ్యతలు తీసుకుంటున్న బాలసుబ్రమణ్యం

అన్నదానం

ప్రజాశక్తి - గుడివాడ : శాంతి నిమిత్తం అన్నదానం చేయడం వల్ల ఈ ప్రాంతం సుభిక్షంగా ఉంటుం దని ఇలాంటి కార్యక్రమాలను చేయడం మంచి పద్ధతి అని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వ రరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాస రావులు అన్నారు. శనివారం స్థానిక మార్కెట్ సెంటర్‌లో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వినాయక విగ్రహ కమిటి సభ్యులు, టిడిపి నాయకులు, పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న రావి, యలవర్తి శ్రీనివాసరావు

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-చల్లపల్లి : పాఠశాల విద్య సమగ్ర శిక్ష, ఎల్. వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్, డిస్టిక్ బ్లైండ్నెస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు ఎల్వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, తాడిగడప వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో దష్టిలోపం కలిగిన 30 మంది విద్యార్థులను గుర్తించి శస్త్ర చికిత్స కోసం రిఫర్ చేయడం జరిగిందని, కళ్లద్దాలు అవసరమైన వారికి వాటిని పంపిణీ చేస్తామని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎస్ రాంబాబు తెలిపారు. జిల్లా ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుభాన్, ఏపీవో ఏడుకొండలు, మండల విద్యాశాఖ అధికారి 2 పరిస్తే వెంకటేశ్వరరావు, వైద్య బందం పాల్గొన్నారు.

ఎన్‌సిసిలో ఉత్తమ క్యాడేట్‌గా ప్రణీత్ సాయి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : 16 ఆంధ్రా బెటాలియన్ తరపున సికింద్రాబాద్‌లో సెప్టెంబర్ 9 నుండి 18 వరకు జరిగిన ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపుకు కృష్ణా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్న 5 మంది ఎన్‌సీసీ విద్యార్థులు హాజర య్యారు. విద్యార్థులకు వివిధ రకాలుగా శిక్షణ ఇచ్చారు. కాకినాడ గ్రూప్‌కు చెందిన వివిధ కళాశాలలకు చెందిన 200 మంది ఎన్‌సిసి విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొనగా వారిలో కష్ణా యూనివర్సిటీకి చెందిన ఎస్.ప్రణీత్ సాయి ఉత్తమ క్యాడెట్‌గా, డిబేట్‌లో ప్రథమ స్థానంలో నిలిచారని అసోసియేట్ ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ డి. రామశేఖర రెడ్డి తెలిపారు. అలాగే శిబిరం నుండి వచ్చిన ఎం.బాబి అభిషేక్ ను, ఎస్ ప్రణీత్ సాయి ను ప్రిన్సిపాల్ ప్రొ.ఆర్.విజయకుమారి, ప్రొ.వై.కె.సుందర కృష్ణ, వైస్ ఛాన్సలర్ ఆర్.శ్రీనివాసరావు ,ఉపాధ్యాయులు అభినందించారు.





విద్యార్థులను పరామర్శిస్తున్న ఎంఎల్‌ఎ (పక్కన) ఎన్‌సిహెచ్.శ్రీనివాస్

ఆటో బోల్తా : విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆటో బోల్తాపడి విద్యార్థు లకు గాయాలైన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... మండలం లోని బూదవాడ గ్రామం నుండి గ్రామానికి చెందిన కొంతమంది విద్యార్థులు ఆటోలో జగ్గయ్యపేట పట్టణంలో గల ఒక ప్రైవేటు కళాశాలకు వెళ్తున్నారు. త్రిపురవరం గ్రామ సమీపంలో ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో కొద్దిమంది విద్యార్థులకు స్వల్ప గాయాల పాలయ్యారు. వీరిని స్థానికుల సహాయంతో జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని బాధితులను పరామర్శించి, డాక్టర్లను మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం బాధితులను ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

బాధితులకు సిపిఎం పరామర్శ

బూదవాడ నుండి జగ్గయ్యపేట వస్తున్న ఆటో ప్రమాదానికి గురై బోల్తా పడ్డ సంఘటనలో విద్యార్థులు గాయాల పాలయ్యారు. దీంతో స్థానికుల సహాయంతో గాయపడ్డ క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రిలో తరలించారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, సిపిఎం నాయకులు దాసరి నాగేశ్వరరావు గాయపడ్డ విద్యార్థులను పరామర్శించారు. ఎన్‌సిహెచ్ మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వర్షాలు వరదల కారణంగా బూదవాడ వయా త్రిపురవరం జగ్గయ్యపేట రోడ్డు దెబ్బతినడం వల్ల ఈ ఆటో ప్రమాదానికి కారణమని తక్షణమే రోడ్ల మరమ్మతు చేపట్టి ఇటువంటి ప్రమాదాలను నివారించాలని కోరారు.

ఆర్థికాంశాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సమాజంలో ప్రతి ఒక్కరికి ఆర్థిక అంశాలపై అవగాహన అవసరమని ఫైనాన్షియల్ ప్లానర్ చిలుకూరి విజయకుమార్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కామర్స్ అండ్ మేనేజమెంట్ విభాగం ఆధ్వర్యంలో 'ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్స్' అంశంపై వర్క్‌షాప్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిలుకూరి విజయకుమార్ మాట్లాడుతూ ఆర్థికాంశాలు లేకుండా జీవితం లేదన్నారు. జీవితంలో ఆర్థిక స్థిరత్వానికి అవగాహన అవసరమన్నారు. హిందూ హైస్కూల్స్ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ. కష్ణవేణి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, విభాగాధిపతి హేమంత్‌కుమార్, అధ్యాపకులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయకుమార్

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - విస్సన్నపేట : మండలం చంద్రుపట్ల టిడిపి నాయకులు భూక్యా శ్రీరాములు అకాల మృతిచెందారు. ఆయన దశదిన కర్మ కార్యక్రమం నిమిత్తం టిడిపి ఆధ్వర్యంలో బద్దె నేతృత్వంలో ప్రముఖ కాంట్రాక్టర్, తాతకుంట్ల టిడిపి నాయకులు ఎన్.టి.వెంకటేశ్వరరావు, ఎన్‌ఆర్‌ఐ వల్లభనేని గిరి, డాబా శ్రీను, వైభవ్, నాగేశ్వరరావు, తదితరులు ఆర్థిక భాగస్వాములై రూ.50 వేలు అందజేశారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : స్వర్ణాంధ్ర 2047 అనే అంశంపై శనివారం విజయవాడలోని బిషప్ అజరయ్య హైస్కూల్ జరిగిన వ్యాస రచన పోటీల్లో కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత ఉన్నత పాఠశాల విద్యార్థిని బండి యశ్విని జిల్లా స్థాయిలో 2047 విజన్ సాకారానికి విద్యా, నైపుణ్యాభివృద్ధిలో మార్పులు అనే ప్రత్యేక అంశంలో తృతీయ బహుమతి గెలుచుకున్నది. జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి.సుబ్బారావు చేతుల మీదుగా బహుమతి అందుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.పద్మలత మాట్లాడుతూ ప్రతిభా పురస్కారం అందుకున్న విద్యార్థినీని శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు. ఎస్‌ఎంసి చైర్మన్ షేక్ బజ్‌బీ ప్రశంసించారు.

నష్టపరిహారం రూ.50వేలకు పెంచాలి: సిపిఎం



విజయవాడలో ఏర్పాటు చేసిన ఆహార కేంద్రం

కొనసాగుతున్న ఆహార పంపిణీ కేంద్రాలు

ప్రజాశక్తి - విజయవాడ : వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి జరిగిన నష్టానికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించి, ప్రతి కుటుంబానికి రూ.50 వేలకు తగ్గకుండా పరిహారం ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు డిమాండ్ చేశారు. సింగ్‌నగర్‌లోని వరద బాధిత ప్రాంతాల్లో బాబురావుతో పాటు సిఐటియు నాయకులు పర్యటించారు శనివారం పర్యటించి ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ప్రజలందరికీ అందిందా లేదా అని వారు అడిగి తెలుసుకున్నారు. బాబూరావు మాట్లాడుతూ వరద బాధితుల కోసం ప్రభుత్వం ప్రకటించిన పరిహారం, ప్యాకేజీ నష్టాన్ని పూడ్చే విధంగా లేదని ధ్వజమెత్తారు. లక్షల్లో ఆస్తి నష్టం జరిగిందన్నారు. మోటార్ వాహనాలకు రూ.మూడు వేలు ఏ మూలకు చాలదని, కనీసం రూ.10వేలకు పెంచాలని కోరారు. ఆటో రిపేర్లకు భారీగా ఖర్చవుతుందని, కనీసం రూ.25వేలు ఇవ్వాలని కోరారు. చిరు వ్యాపారులకు లక్షకు తగ్గకుండా సహాయం చేయాలన్నారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రెండు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరదల్లో మరణించిన ప్రతి కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలన్నారు.

మూడో రోజుకు చేరిన అన్నదాన కేంద్రాల నిర్వహణ



ఇబ్రహీంపట్నంలో ఆహార కేంద్రం

సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కేంద్రాలు శనివారం (మూడవ రోజు) కూడా నడిచాయి. వరద బాధితులు పెద్ద ఎత్తున తరలి వచ్చి భోజనం చేశారు. ఎల్‌బిఎస్ నగర్, డాబాకొట్లు సెంటర్‌లలోని కేంద్రాల వద్ద బాధితులు బారులు తీరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వేంకటేశ్వరరావు, జిల్లా నాయకులు ఏ. కమల, ఎం. సోమేశ్వరరావు నగర అధ్యక్షుడు కె.దుర్గారావు, నగర నాయకులు టి.ప్రవీణ్ వై.సుబ్బారావు, యం.బాబురావు, స్థానిక నాయకులు చింతల శ్రీనివాస్, ఎస్‌కె పీరు, అప్పన్న, వెంకటేశ్వరరావు (కొండ) తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** సిఐటియు రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం మండల కమిటీ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం కొండపల్లి మున్సిపాలిటీ కార్మికులకు భోజన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించిన, ఇప్పుడు అకాల వర్షాలకు వరద ముంపునకు సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించిన మున్సిపల్ వారియర్స్‌కు అన్నదానం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని సిఐటియు మండల కార్యదర్శి మహేష్ తెలిపారు. సిఐటియు నాయకులు కె.వాసు దేవన్, ఇ.కొండలరావు, ఎస్.పాపయ్య, ఐద్వా నాయకులు ఎల్.పార్వతి, కె.బేబీ సరోజిని, కొండపల్లి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రెసిడెంట్ బి.అప్పారావు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అవగాహన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా మణిపాల్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో శనివారం గుండె జబ్బులపై అవగాహన కల్పించేందుకు వాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రన్‌లో వైద్యులు, వైద్య సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మణిపాల్ హాస్పటల్స్ గుండె వైద్యులు డాక్టర్ ఎన్.మురళీకృష్ణ మాట్లాడుతూ నడకతోనే మనం గుండెకు దీర్ఘాయుస్సు సాధ్యపడుతుందన్నారు. వయసుతో నిమిత్తం లేకుండాగుండె జబ్బులు వస్తున్నాయన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ఆహార అలవాట్లు మార్చుకోవడంతో పాటు ప్రతిరోజూ వ్యాయామం చేయడం వలన గుండె సంబంధ సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. గుండె సంబంధ సమస్యలనుముందుగానే తెలుసుకుని జాగ్రత్తలు తీసుకునేందుకుగాను మణిపాల్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో పలు ఆరోగ్య ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రూ.3999లు, రూ.5999లు రూ.9999లతో



వివిధ రకాలైన ప్యాకేజీలతో ఆరోగ్య పరీక్షలను చేయించుకుని పలు రకాలైన సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని తెలిపారు. అక్టోబరు 10వ తేదీ వరకు ఆరోగ్య ప్యాకేజీలపై ప్రత్యేక ఆఫర్లు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణిపాల్ హాస్పటల్ డైరెక్టర్ సుధాకర్ కంటిపూడి, మణిపాల్ హాస్పటల్స్ కార్డియాలజిస్టులు డాక్టర్ నర్రా సందీప్, డాక్టర్ దిలీప్ రట్టి, డాక్టర్ లక్ష్మీ నవ్య, డాక్టర్ శ్రీనివాస్‌బాబు, డాకటర్ సమరసింహారెడ్డి పలువురు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి లక్ష్మీనరసమ్మ, దిద్ది లలిత వీరిద్దరూ అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ స్వర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం దిద్ది లలితకు రూ.50వేలు బొమ్మిశెట్టి లక్ష్మీ నరసమ్మకు రూ.50వేలు ఎల్‌ఒసిలను ఎంఎల్‌ఎ శ్రీరాం నివాసంలో వారి కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు.

నిత్యావసర సరకులు పంపిణీ

ప్రజాశక్తి - భవానీపురం : ఇటీవల వరద ముంపులో తీవ్రంగా నష్టపోయిన విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఊర్మిళానగర్, కబేళా ప్రాంతాలకు చెందిన 500 కుటుంబాలకు నిత్యావసర సరకులు, దుస్తులను పండిట్ రవిశంకర్ గురుదేవ్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ బాధ్యులు కాంతారావు, అమెరికా సెయింట్ లూయిస్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐ సంస్థ ధ్వని బాధ్యులు నాగిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకులు నాగిరెడ్డి, టిడిపి నేత బొమ్మసాని సుబ్బారావు మాట్లాడుతూ అమెరికాలోని సెయింట్ లూయిస్ నగరంలో స్థిరపడ్డ తెలుగు వారందరూ కలిసి ధ్వని స్వచ్ఛంద సంస్థ పేరుతో ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ 43 డివిజన్ నాయకులు ఎం. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఇటీవల భారీ వర్షాలకు మండల కేంద్రమైన రెడ్డిగూడెంలోని పలుచోట్ల అంతర్గత రహదారులు కోతకు గురై ధ్వంసం అయ్యాయి. దీంతో స్పందించిన మండల టిడిపి అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరెడ్డి గ్రావెల్ పరిచి రహదారులు అభివృద్ధి చేస్తున్నారు. రెడ్డిగూడెం నుండి కుదప వెళ్లే రహదారి ఆనుకొని రాఘవాపురం గ్రామంలోకి వెళ్లేందుకు గానూ కోతులు వాగు, వంతెన వరద ప్రవాహానికి వంతెన అనుకొని ఉన్న చప్టా సిసి సి రోడ్డు ధ్వంసం అయ్యాయి. దీంతో ఈ రహదారిపై ద్విచక్ర వాహనాలు మినహా రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం నాగేశ్వర్ రెడ్డి కోతకు గురై ధ్వంసమైన చప్టాను గ్రావెల్ పరిచి అభివృద్ధి చేస్తున్నారు.

కల్యాణ మండపానికి వితరణ

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలం పెనుగొలను శివారున గల మెట్టగుట్ట శ్రీ శేషాచల శ్రీనివాస స్వామి కళ్యాణ మండప నిర్మాణానికి దాత రూ.51వేలు వితరణ చేశారు. ఖమ్మం పట్టణానికి చెందిన నాగుబండి రంగయ్య- లక్ష్మీకాంతం జ్ఞాపకార్థం కుమారులు వెంకటేశ్వరరావు, కిరణ్ ఈ వితరణ శనివారం అందజేశారు.

నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం తిరుపతి లడ్డు మహాప్రసాదం వివాదానికి నిరసనగా దేవాలయం నుండి అమ్మవారి సన్నిధి వరకు యాత్రికులు ప్లకార్డులతో నిరసన ర్యాలీ చేపట్టారు.

పలుచోట్ల ఘనంగా గుర్రంజాషువా జయంతి

ప్రజాశక్తి - మైలవరం : జాషువా బాల్యంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వర్ణ వివక్షతను కళ్లారా చూశారని తాను ఎదుర్కొన్న కష్టాలకు చదువు ఒక్కటే మార్గమని కష్టపడి చదువుకున్నారని పలువురు అన్నారు. స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి హనీమి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం గుర్రంజాషువా 129వ జయంతి ఘనంగా నిర్వహించారు. **జగ్గయ్యపేట :** పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ విశ్రాంతప్రభుత్వ ఉద్యోగుల భవనంలో జాషువా జయంతి విశ్రాంత అధ్యాపకులు అబ్బాస్ అలీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వడ్డేపల్లి శ్రీనివాసరావు విచ్చేశారు. తదుపరి అయన రాసిన పద్యాలు పఠనం చేశారు. ప్రముఖ కవి సరికొండ నరసింహారాజు జాషువా రాసిన పుస్తకం గబ్బిలం స్ఫూర్తితో గబ్బిలంపై రాసిన కవితను గానం చేశారు. మరియొక కవి ఉపాధ్యాయులు బత్తుల భ్రహ్మయ్య కూడా జాషువా రాసిన కవితలు పద్యాలు వినిపించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **తిరువూరు :** గుర్రం జాషువ యువతకు స్ఫూర్తి ప్రధాత భగత్ సింగ్ 117వ జయంతి కార్యక్రమాన్ని ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు శనివారం తిరు వూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఇరువురి చిత్రపటాలకు పూలమాలవేసి ఘ నంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా నాయకులు రాంప్రదీప్, ఎల్ఐసి ఏజెంట్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సాహిత్యం ద్వారా వివక్షతను ఎండ గట్టేందుకు జాషువా కృషి చేశారన్నారు. చిరుప్రాయంలోనే జాతీయోద్యమంలో పాల్గొని తన ప్రాణాలను త్యాగం చేసిన వీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కడిమి పాపారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు ఎం.హరికృష్ణ, ఎం.సుధాకర్, రైతు సంఘం నాయకులు ఎస్.నాగేశ్వరరెడ్డి, సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఎ.రవి, న్యాయవాది ఎం.నా గేంద్రప్రసాద్, ప్రజా నాట్య మండలి నాయకులు కె.వి.రత్నం, కెవిపిఎస్ నాయకులు ఎం.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు. **వత్సవాయి :** స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జాషువా జయంతి నిర్వహించారు, ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఉపాధ్యాయులు నివాళులర్పించారు, ప్రధానోపాధ్యాయులు అశోక్ కుమార్, ఉపాధ్యాయులు ఆంగ్ల ఉపాధ్యాయుడు అద్దంకి సుధాకర్‌ను సన్మానించారు. విద్యార్థులకు పద్య పోటీలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థి అయిన షేక్ జాన్ సైదా 100 పద్యాలను ఏకధాటిగా ధారాళంగా చెప్పాడు. ఉపాధ్యాయులు జాన్ సైదాని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జలాల్, భవనేష్ శ్రీనివాస్ రామకష్ణ,, బుజ్జి బాబు, స్వాతి వెంకట్ రెడ్డి, శ్రియోలు, తదితరులు అభినందించారు. **నందిగామ :** నందిగామ పట్టణంలో బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో జాషువా ఫౌండేషన్ నందిగామ ఆధ్వర్యంలో జాషువా 129వ జయంతి వేడుకలు నిర్వహించారు. నందిగామ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య పాల్గొని నివాళులు అర్పించారు. జాషువా ఫౌండేషన్ - స్నేహ క్లబ్, ఆనంద్ ఎలక్ట్రికల్స్ అండ్ ఈవెంట్స్, సోల్స్ సొసైటీ - జెఎసీ ఫర్ పీపుల్స్ రైట్స్ కోట శామ్యూల్ రవీంద్రనాథ్, మందా స్వామిదాసు , నందిగామ మున్సిపల్ కమీషనర్, కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు. నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాషువా జయంతి వేడుకలు నిర్వహించారు. అధ్యక్షులు నంద్రు బాబు విద్యాసాగర్ పాల్గొన్నారు.



వత్సవాయిలో మాట్లాడుతున్న స్కూల్ ప్రధానోపాధ్యాయులు

ఇల్లు కట్టాలంటే ముందు రోడ్లు వేయండి

• గృహ నిర్మాణశాఖాధికారులను నిలదీసిన కాలనీలవాసులు


పెడన మండలంలో అధికారులను నిలదీస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-పెడన : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన 'మన ఇల్లు మన గౌరవం' కార్యక్రమంలో అధికారులకు చుక్కెదురైంది. పెడన పైడమ్మ తల్లి కాలనీ, పల్లోటి వెనుక ఉన్న రెండు కాలనీలోని లబ్ధిదారులకు ఈ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులను లబ్ధిదారులు నిలదీశారు. ముందు కాలనీల్లో సమస్యలను పరిష్కరించిన తర్వాతే గృహాలు నిర్మించుకుంటామంటూ కాలనీవాసులు హౌసింగ్ ఏఈ సూర్యనారాయణకు తేల్చి చెప్పారు. విద్యుత్, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి సౌకర్య లేక తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ వాపోయారు. వికలాంగులకు కేటాయించిన 39 నివేశనా గృహాల్లో నేటికీ కనీసం ఒక్కరోడ్డు కూడా వేసిన దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ఒక వ్యక్తి మృతి చెందితే ఇంట్లో నుంచి బయట పెట్టడానికి కూడా మార్గం లేక ఇబ్బందులు పడ్డామన్నారు. రాత్రి వేళల్లో కాలనీకి వచ్చే రోడ్డులో కొంతమంది ఆకతాయిలు మద్యం తాగి అల్లర్లు సృష్టిస్తున్నారని అంటున్నారు. అంతేకాకుండా తాము కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఎంతో కష్టి చేశామన్నారు. ఏర్పడిన అనంతరం ఈ వంద రోజుల్లో ఈ సౌకర్యలు కల్పించాలంటూ మున్సిపల్ అధికారులకు, పోలీసు అధికారులకు, అలాగే మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాకు కుమారి ప్రసాద్, ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కు లిఖితపూర్వకంగా తమ సమస్యలను పరిష్కరించాలంటూ అర్జీలు దాఖలు చేసేమన్నారు. కానీ నేటికీ తమ సమస్యలను పరిష్కరిస్తామని ఏ ఒక్కరు కూడా ముందు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే పెడన పట్టణ రూరల్ ప్రాంతాల్లో రెండు చోట్ల మన ఇల్లు మన గౌరవం అన్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినప్పటికీ కేవలం పట్నానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న మడక గ్రామంలోని పాల్గొని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ తిరిగి వెళ్ళిపోవడం విశేషం.

మడకలోను అదే తీరు...

మండల పరిధిలోని మడకలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ఎమ్మెల్యే వద్ద సమస్యలు చెప్పుకోవడానికి గ్రామస్తులు బారులు తీరారు. కాలనీలోనూ, గ్రామాల్లోనూ సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు రోడ్లపై చేరుతుందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా పంచాయతీకి చెందిన చెరువు కొంతమంది ఆక్రమించుకున్నారని వీటిని సర్వే చేయించాలని విజ్ఞప్తి చేశారు.

కంకిపాడులోనూ అధికారులను నిలదీసిన మహిళలు

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు పంచాయతీలో జరిగిన నివేశన స్థలాల లబ్ధిదారులతో జరిగిన సమావేశంలో గందరగోళం నెలకొంది. మనఇల్లు – మన గౌరవం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ అధికారులును, ప్రజాప్రతినిధులను మహిళ లబ్ధిదారులు నిలదీశారు. అధికారులు ఇప్పటికి సరైన రోడ్డును కాలనీలోకి వెళ్ళేందుకు వేయలేదని, ఇంటి నిర్మాణానికి కావాల్సిన సామాగ్రిని అందివేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న కాలనీ లలో ఇళ్ళు కట్టకపోతే స్థలాలు వెనక్కి తీసుకుంటామంటున్నారని, దీనికి ప్రభుత్వ ఆర్డర్ ఉందా అని నిలదీయడంతో అధికారులు సభ నుంచి వెళ్ళిపోయారు.

విద్యాసామాగ్రి పంపిణీ

ప్రజాశక్తి – గుడివాడ : ఉపాధ్యాయ రంగ సమస్యలతో పాటు సామాజిక పరంగాను రాష్ట్రోపాధ్యాయ సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలు నిరుపమానమని నందివాడ మండల విద్యాశాఖ అధికారి బి.శ్రీనివాసు కొనియాడారు. శనివారం ఎస్టియు నందివాడ శాఖ ఆధ్వర్యంలో మండల ఉపాధ్యాయుల సహకారంతో చేపట్టిన విద్యా సామగ్రి ఎంఇఓ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల 1,2 తరగతుల విద్యార్థులకు ఎస్టియు ఆధ్వర్యంలో పలకలు, పెన్సిళ్లు, బలపాలు పంపిణీ చేయడం ప్రశంసనీయమన్నారు. ఎస్టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్.ఎన్ ప్రసాద్, ఎస్.టి.యు నాయకులు కె.వి సత్యనారాయణ, బి.జీవనప్రకాష్, ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, తిలక్, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఆబ్కారీ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర అన్నారు. మంత్రి శనివారం స్థానిక 12వ డివిజన్ రైలు పేటలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్, ఇలియాస్ పాషా , వెంకన్న, శ్రీరాములు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి – గుడివాడ : గుడివాడ సమగ్రంగా అభివృద్ధి చెందడమే నా ధ్యేయమని, 20 ఏళ్ల ఎమ్మెల్యే ఉన్న కొడాలి నాని వరదలు వచ్చిన సమయంలో ఏమైపోయాడని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం నందివాడ మండలం అనమనపూడి పంచాయతీ పరిధిలోని గొంగళ్ళమూడిలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, బిజెపి కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, నాయకులు పిన్నమనేని బాబ్జీ, మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు పాల్గొన్నారు.

ప్రమోషన్ ఉత్తర్వులు అందజేత

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు అనుసరించి ఉమ్మడి కృష్ణాజిల్లాలో 24 మంది ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి తాహేరా సుల్తానా కౌన్సెలింగ్ నిర్వహించి పదోన్నతి ఉత్తర్వులు అందించారు. వీరిలో మునిసిపల్ కార్పొరేషన్, మచిలీపట్నం, గుడివాడ మున్సిపల్ మేనేజిమెంట్ కు సంబంధించిన 19 మంది స్కూల్ అసిస్టెంట్స్ తెలుగు, 5గురు హిందీ ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అజీజ్ ,సూపరింటెంట్ పవన్ కుమార్, సూరిబాబు రాంప్రసాద్, మరియు డీసీబీ సెక్రటరీ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : జెసి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ కోరారు. విభిన్న ప్రతిభావంతులు హిజ్రాలు, వయో వద్దుల సంక్షేమ శాఖ కృష్ణాజిల్లా, ఎన్‌టిఆర్ బధిర సంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ బధిరుల దినోత్సవాన్ని అంతర్జాతీయ సంస్థల భాష దినోత్సవం మచిలీపట్నంలోని స్థానిక నోబుల్ కాలేజ్ కాన్ఫరెన్స్ హాల్ నందు శనివారం ఘనముగా నిర్వహించబడినది. ఈ సందర్భంగా జేసీ మట్లాడుతూ ప్రభుత్వం బధిరుల కొరకు ఉపకరణాలు చెవిటి మిషన్లు, టచ్ ఫోన్స్, ల్యాప్ టాప్స్ అందిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు. సహాయ సంచాలకులు వి కామరాజు, మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామక్రిష్ణ, నోబెల్ కాలేజ్ ప్రిన్సిపల్ డా. ఎస్ జే ఎర్నెస్ట్, జనరల్ సెక్రటరి టి. దేవనగేష్ పాల్గొన్నారు.

బందరు సబ్ జైల్ సందర్శన

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం, స్పెషల్ సబ్ జైలును కృష్ణా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి అరుణ సారిక, జిల్లా లీగల్ ఎయిడ్ అథారిటి కార్యదర్శి కె వి.రామ కృష్ణయ్య శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపకారాగారం, మచిలీపట్నం నందున్న ముద్దాయిలకు అందుతున్న న్యాయ సహాయం వివరములను, వారికి కల్పిస్తున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిలకు న్యాయపరమైన హక్కులు గురించి అరుణ సారిక, వి .రామ కృష్ణయ్య , లీగల్ ఎయిడ్ డిఫెన్సు కౌన్సిల్ అడ్వకేట్ చీలి మునెయ్య, జైల్ సూపరింటెండెంట్ పిల్లా రమేష్ వివరించారు. ఈ కార్య క్రమములో డిప్యూటి జైలర్ బొత్స అప్పారావు , జైల్ సిబ్బంది, మరియు లీగల్ ఎయిడ్ డిఫెన్సు కౌన్సిల్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు మాటలన్నీ అబద్ధాలే : పేర్ని

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : తిరుమలలో కల్తీ నెయ్యి అయితే వాడారు కానీ ఎక్కడ వాడారో ఎందుకు వాడారో తనకు తెలి యదని ఇప్పుడు చంద్రబాబు తాజాగా అంటున్నారని, ఆయన నోరు తెరిస్తే అన్ని అబద్ధాలే ఆడతారని మాజీ మంత్రి, కృష్ణాజిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు, పేర్ని వెంకట్రామయ్య మచిలీపట్నం బచ్చుపేట లోని శ్రీ వెంకటేశ్వర స్వామీ ఆలయంలో శనివారం ఉదయం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, బొర్రా విఠల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెడనలో రెండో రోజూ విజ్ఞాన ప్రదర్శన

• ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు



ప్రజాశక్తి- పెడన : రీజినల్ సైన్స్ సెంటర్ తిరుపతి, సెల్యులర్ సెంటర్ మైక్రో బయాలజీ, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంచార వాహన ప్రదర్శన రెండవ రోజైన శనివారం కూడా స్థానిక బ్రహ్మపురంలోని బట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగింది. ఈ సంచార ప్రదర్శన వలన బాల్యం దశ నుంచి విద్యార్థిని, విద్యార్థులకు ఎంతో జ్ఞాన సంపదనను అందిస్తుందని పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పేర్కొంటున్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సునీల్ మిత్ర ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శన రెండవ రోజు 1000 మందికి పైగా విద్యార్థిని, విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఎంఈఓలు దుర్గాప్రసాద్, హరినాథ్ ల ఆధ్వర్యంలో మండల పరిధిలోని అన్ని పాఠశాల నుంచి విద్యార్థిని, విద్యార్థులు సంచార ప్రదర్శన వలన కలిగే ఉపయోగాలు గురించి తెలుసుకున్నారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వీటిని తిలకించి విజ్ఞానంపై అవగాహన కల్పించడం ఎంతో ఆనందదాయకమని పేర్కొంటున్నారు.

బీమా ఉద్యోగుల చేయూత ప్రశంసనీయం : మంత్రి


జెండా ఊపి వ్యానును ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : వరద బాధితుల సహాయార్థం ఇన్సూరెన్స్ ఉద్యోగులు అందిస్తున్న చేయూత ప్రశంసనీయమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియిన్, మచిలీపట్నం ఆధ్వర్యంలో, వరద బాధితుల సహాయం అందజేసేందుకు శనివారం మచిలీపట్నం నుండి బయలుదేరిన నిత్యావసర వస్తువులు తో కూడిన వ్యాన్ కు గనులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర జండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విజయవాడ వరద సహాయ కార్యక్రమంలో భాగంగా ఎల్ఐసి,ఉద్యోగులు విజయవాడ నందు వివిధ ప్రాంతాల వరద భాధితులకు సహాయ కార్యక్రమం నిర్వహించడం అభినందనలు తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఐ సి ఇ యుఆధ్వర్యంలో నిత్యావసర సరుకులతో కూడిన కిట్స్ ను, వీరలు దుప్పట్లు, భోజనాల ఏర్పాట్లు, ఇంట్లో వినియోగించు స్టీల్ సామానులు పలు విడతలు గా విజయవాడ వరద బాధిత ప్రజానీకానికి పంపిణీ చేశ్యామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె. సుధాకర్, డి .వాసు,ఎల్. రాజశేఖర్, ఎ. శ్రీనివాస రావు, బండి శ్రీను, బి. మాధుర్,పి. నాగయ్య, వేము కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భగత్‌సింగ్, జాషువాలకు ఘన నివాళి


గుడివాడలో నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి – గుడివాడ : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) గుడివాడ కమిటీ ఆధ్వర్యంలో భారతజాతి ముద్దుబిడ్డలు సర్దార్ భగత్ సింగ్ 117వ జయంతి, గుర్రం జాషువా 129వ జయంతిలను ఎస్‌పిఎస్, చైతన్య, నారాయణ కళాశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం తెలిపారు. ఈ సందర్భంగా సమరం మాట్లాడుతూ సర్దార్ భగత్ సింగ్ 22 సంవత్సరాలు వయసులో భారతజాతి సంకెళ్ళ విముక్తి కోసం బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. అదేవిధంగా గుర్రం జాషువా ప్రపంచ ప్రఖ్యాతగాంచిన తన రచనలతో తన కవిత్వాలతో ఎన్నో అవార్డులు వరించాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సలీం గుడివాడ కమిటీ సభ్యులు కిషోర్ సాయి నాగేంద్ర ఎస్‌పిఎస్ స్కూలు ప్రధాన ఉపాధ్యాయురాలు రాణి, నారాయణ కాలేజ్ డీన్ రఘు, చైతన్య కాలేజ్ ప్రిన్సిపాల్ వేణు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-అవనిగడ్డ : సమాజంలోని అసమానతలు రూపుమాపేందుకు మహాకవి గుర్రం జాషువా రచనలు చేశారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కొనియాడారు. శనివారం జాషువా జయంతి వేడుకలను పురస్కరించుకొని ఎమ్మెల్యే కార్యాలయంలో జాషువా చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రావు, టిడిపి నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, దేవి సినిమా లలిత కళా సమితి కార్యదర్శి కూనప రెడ్డి చంద్రశేఖర్, టిడిపి నాయకులు బండే రాఘవ, కర్ర సుధాకర్ పాల్గొన్నారు.



సరస్వతీగోరా జీవితం ఆచరణీయం

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సమాజంలోని అసమానతలు, స్త్రీల ఎడల చూపుతున్న వివక్షత,స్త్రీ సమస్యలను అర్థం చేసుకుంటూ వాటి పరిస్కార దిశగా సాగిన సరస్వతీ గోరాను నేడు కూడా అనుసరించడం చాలా ముఖ్యం అని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. బెంజిసర్కిల్ వద్ద గల నాస్తిక కేంద్రంలో సరస్వతీ గతోరా 112వ జయంతి కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డి. రమాదేవి మాట్లాడుతూ అప్పటి కాల పరిస్థితులు కొన్ని ఇప్పటికీ కొనసాగుతున్నాయని అన్నారు. సమాజంలోని అణగారిన వారి సమస్యలు ఇంకా పరిష్కారం కాకుండా ఉన్నాయని, వాటి ఎడల శ్రద్ధ వహించాలని కోరారు. సరస్వతీగోరా జీవితంలోని అనేక సంఘటనలను పేర్కొంటూ ఆమె చూపిన మార్గం అటువంటి సమస్యల పరిష్కారానికి చక్కటి దిక్సూచి అన్నారు. ఈ కార్యక్రమానికి నియంత అధ్యక్షత వహించగా వౌర ప్రసాద్, డాక్టర్ మారు, హరిసుబ్రహ్మణ్యం పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు సరిగమప సింగింగ్ యూత్ ఐకాన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సరిగమప సీజన్ 16 ది నెక్ట్స్ సింగింగ్ యూత్ ఐకాన్ గ్రాండ్‌ప్రారంభోత్సవ కార్యక్రమం ఈనెల 29వ తేదీన జీ తెలుగు ఛానల్‌లో ప్రారంభ మవుతుందని ఛానల్ ఇన్‌ఛార్జి కె. ఈశ్వర్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. ప్రతిభావంతులైన యువ గాయకులను వెలికితీయడమే ప్రధాన లక్ష్యంగా సరిగమప సింగింగ్ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 15సీజన్లు విజయవంతంగాపూర్తియ్యాయని, ఇపుడు 16వ సీజన్ ఆదివారం ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రతి ఆదివారం 9 గంటలకు ప్రసారమవుతుందని తెలిపారు.

పంట రక్షణ కోసం గోద్రెజ్ హలో హెల్ప్‌లైన్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వ్యవసాయ, ఆహార సంస్థల్లో ఒకటైన గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ సంస్థ పంట రక్షణ కోసం హలో గోద్రెజ్ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించినట్లు సంస్థ ఇన్‌ఛార్జి కె.ఎ. ఉమామహేశ్వరరావు తెలిపారు. ఎంజి.రోడ్డులోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. పంట రక్షణకు వాస్తవ సమయంలో ఫోన్‌కాల్ ద్వారా నిపుణుల సలహాలను అందించడానికి బహుభాషా వ్యవసాయ సలహా హెల్ప్‌లైన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. తెలుగుతో పాటు ఇంగ్లీషు, హిందీ, వివిధ రాష్ట్రాలలోని ఆయా ప్రాంతీయ భాషల్లో కూడా హెల్ప్‌లైన్ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు పూర్తి స్థాయిలో చేయూతను అందించడంతో పాటుగా వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించవడానికి ఉపయోగడపతుందని తెలిపారు.

‘ లడ్డూ విషయంలో జగన్‌పై కుట్ర’

ప్రజాశక్తి - వన్‌టౌన్ : తిరుపతి లడ్డూ విషయంలో మాజీ సీఎం జగన్‌పై కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైసీపీ పశ్చిమ ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం బ్రాహ్మణ వీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో చంద్రబాబు పాపాల ప్రక్షాళన పేరిట వెలంపల్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మీడియాతో మాట్లాడుతూ గతంలో నాణ్యత పరీక్షలకు నెయ్యిని మైసూరుకు పంపించేవారని, కానీ ఎప్పుడు లేని విధంగా నేడు గుజరాత్‌కి పంపించారని, దీనిలో కుట్ర కోణం దాగి ఉందని అన్నారు. హిందూ మతం ముసుగులో రాష్ట్రాన్ని ముక్కలు చేసే విధంగా ఈ కూటమి ప్రభుత్వం ప్రవర్తిస్తోందని, దీన్ని ఖండిస్తున్నామని వెలంపల్లి అన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, వైసీపీ రాష్ట్ర నాయకులు పోతిన వెంకట మహేష్, కొనకళ్ల విద్యాధరరావు, కొండపల్లి బుజ్జి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఎన్యుమరేషన్లో గందరగోళం

పరిహారం వరద బాధితులందరికీ అందలేదు. కనీసంగా 10 నుంచి 15 శాతం మంది బాధితులకు వరద సాయం మంజూరు కాక ఎదురు చూస్తున్నారు. ఎన్యుమరేషన్ ప్రక్రియే ప్రమాణాలకనుగుణంగా జరగకుండా అంతా తప్పుల తడకగా ఉండటమే గాక పారదర్శకంగా లేదని బాధితుల రోదనలే విధితం చేస్తున్నాయి. ప్రభుత్వం వెల్లడించిన ప్రామాణికాలు క్షేత్రస్థాయిలో ఆచరణలో అమలు కాలేదు. ప్రతి ఇంటికీ లక్ష నుంచి నాలుగైదు లక్షలు వరకు నష్టం వాటిల్లగా ప్రభుత్వం మాత్రం గ్రౌండ్‌ఫ్లోర్‌కు రూ.25 వేలు, ఫస్ట్ ఫ్లోర్‌కు 10 వేలు ప్రకటించి, తూతూ మంత్రం అన్నట్లుగా పరిహారం పంపిణీ చేసినా ఈ కనీస పరిహారం కూడా పూర్తి స్థాయిలో వరద బాధితులకు అందలేదు. పనులకు వెళ్లి, అందుబాటులో లేని వారిని, ఆధార్‌కార్డుకు ఫోన్ నెంబర్ లింక్ కాలేదని వేర్వేరుగా కాపరాలుంటూ ఒకే ఇంట్లో ఉంటున్నప్పటికీ వారందరినీ ఒకే కుటుంబంగా పరిగణించడం, ఇలా అనేక రూపాల్లో ఎన్యుమరేషన్‌ను సరిగా చేయలేదని తెలుస్తుంది. కట్టుబట్టలతో బయటపడ్డామని, సర్వం కల్పోయామని, కానీ తమకు మాత్రం పరిహారం అందలేదని పిల్లాజల్లతో తరలి వస్తూ జిల్లా అధికారులకు వారి గోడు వినిపిస్తున్నారు. శనివారం కూడా వందల సంఖ్యలోనే జిల్లా కలెక్టరేట్‌కు బాధితులు విచ్చేయగా వారికి మద్దతుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటిబాబూరావు, జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, ఇతర జిల్లా నాయకులు నిలిచారు. వరద బాధితులకు సాయం అందించకపోతే కార్యాలయాలను దిగ్బంధించడం జరుగుతుందని బాధిత ప్రజలు, నాయకులు హెచ్చరించారు. ఇదే రీతిలో శుక్రవారం కూడా సుమారు 1500 మందికి పైగా వరద బాధితులు కలెక్టరేట్‌కు విచ్చేసి, వినతిపత్రాలను అందజేశారు. గత గురువారం కూడా ఇదే రీతిలో కలెక్టరేట్‌కు తరలి వచ్చారు.

వీక్షణం

రోజూ ఇలాగే క్యూ కడతారని జిల్లా కలెక్టరేట్‌లోని ఆయా విభాగాల ఉన్నతాధికారులు వ్యక్తం చేస్తుండటం గమనార్హం. అయితే మరొక వైపున 85 వేల మందికి వరద సాయం చేయడం జరిగిందని, ఇంకా నాలుగు వేల మందికి ఎంఎస్‌ఎంఇ సాయం చేయాల్సి ఉందని ఇంకా జిల్లా కలెక్టరేట్‌కు విజయవాడ నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రోజూ వస్తూనే ఉన్నారని, వీరంతా ఎక్కడున్నారని జిల్లా స్థాయి అధికారులు సైతం విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. వన్‌టౌన్ పాలఫ్యాక్టరీ ఏరియాలోని ఫ్లైఓవర్ దగ్గర 45వ డివిజన్‌లో ఒకే చోట 25 ఇళ్లు ఉండగా, వాటిల్లో కేవలం 10 ఇళ్లకు మాత్రమే ఎన్యుమరేషన్ జరిగినట్లు, మిగిలిన బాధిత కుటుంబాల పేర్లు ప్రభుత్వం లిస్టులో లేవని స్థానికులు లబోదిబోమంటున్నారు. 46,47 డివిజన్ల పరిధిలోని మునిసిపల్ పారిశుధ్య కార్మికులు నివాసముంటున్న విఎంసి కాలనీ మొత్తం వరద నీటిలో మునిగిపోయింది. ఇళ్లల్లోకి ఐదారు అడుగుల మేర నీరు చేరి ఇళ్లల్లో ఉన్న అన్నీ దెబ్బతిన్నాయి. అయితే ఈ కాలనీలో 61 కుటుంబాలుంటే 30 కుటుంబాలకు మాత్రం ఎన్యుమరేషన్ జరిగింది. ఒక్క పైసా కూడా సాయం రాలేదని ఆప్కాస్ కార్మికుడు తెలిపి ఆవేదన వ్యక్తం చేశాడు. వాంబేకాలనీ ఇ-బ్లాక్‌లో 1270 కుటుంబాలుంటే 920 మందికి మాత్రమే పరిహారం మంజూరు అయింది. ఇక్కడుంటున్న 1,700 మందిలో 700 మందికి మాత్రమే ఎన్యుమరేషన్ సక్సెస్ అయింది. మిగిలిన వారిని అప్లికేషన్ పెట్టుకోవాలని అధికారులు ఉచిత సలహా ఇస్తున్నారని బాధితులు మండిపడుతున్నారు. ఎన్యుమరేషన్ లిస్టులో భర్త/ భార్య పేరు రాలేదు. కానీ వారి నాలుగేళ్ల చిన్న పిల్లవాడి పేరు మీద మ్యాపింగ్ చేశారు. ఈ పిల్లవాడి పేరు మీద బ్యాంక్ అకౌంట్ లేకపోవడంతో గుర్తించినా కానీ ప్రయోజనం లేకుండా పోయింది. ఒక్క వాంబేకాలనీలోనే ఇలా చాలా అవకతవకలు జరిగాయి. మంజూరయిన వారికి కూడా హౌస్ వస్తే టు వీలర్ గుర్తించలేదు. ఇలా ఒకటి గుర్తిస్తే మరొక దానిని గుర్తించలేదు. మరోవైపు వ్యవసాయ భూములు కొట్టుకుపోయి, ఇసుక మేట వేసినా ఒక్క పైసా రాలేదని పలు గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క ఎకరం బాగు చేసుకోవాలంటే లక్షలాది రూపాయలవుతాయని, కానీ ప్రభుత్వం మాత్రం ఒక్క పైసా ఇవ్వలేదంటున్నారు. ఇప్పటికయినా సక్రమంగా క్షేత్రస్థాయిలో మరొక సారి ఎన్యుమరేషన్ చేసి, సరైన న్యాయం చేయాలని బాధితులతో పాటు రాజకీయపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

- రాజు

జర్నలిస్టులు అధైర్య పడొద్దు

- ఎంఎల్‌ఎ కొలికపూడి వ్యవహారంపై చంద్రబాబు
- సిఎంకు, పల్లాకు ఎపిడబ్ల్యుజెఎఫ్ వినతి
- తిరువూరు నుండి తరలివచ్చిన జర్నలిస్టులు


పల్లాకు వినతిపత్రం ఇస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, జిల్లా నాయకులు ఎం.వి.నారాయణ, పలువురు జర్నలిస్టులు

ప్రజాశక్తి - విజయవాడ, తిరువూరు : జర్నలిస్టులెవరూ అధైర్య పడొద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తిరువూరు ఎంఎల్‌ఎ కొలికపూడి వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యాన తిరువూరు నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు శనివారం అందజేసిన వినతిపత్రంపై సిఎం స్పందించారు. జర్నలిస్టులను దుర్భాషలాడి, భౌతికదాడులు సైతం చేస్తానని బెదిరింపులకు పాల్పడిన తిరువూరు ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాసరావుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫెడరేషన్ నేతలు, జర్నలిస్టులు మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో సిఎం చంద్రబాబుకు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ తిరువూరులో జరిగిన ఘటనలు తన దృష్టిలో ఉన్నాయన్నారు. వీటిపై ఆలోచన చేస్తున్నామని, త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. జర్నలిస్టులకు అండగా తమ పార్టీ ఉంటుందన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా స్పందిస్తూ... కొలికపూడితోపాటు రాష్ట్రంలో ఇంకా ముగ్గురు ఎంఎల్‌ఎలపైనా ఫిర్యాదులు వచ్చాయన్నారు. సిఎం చంద్రబాబు త్వరలోనే చర్యలు తీసుకుంటారని చెప్పారు. తిరువూరులో జరిగిన ఘటనలు తమ అధినేత చంద్రబాబు దృష్టిలో కూడా ఉన్నాయని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, జిల్లా ఉపాధ్యక్షులు ఏం.వి.నారాయణతోపాటు మద్దతుగా ఎపియుడబ్ల్యుజె జిల్లా ప్రధాన కార్యదర్శి యు.వెంకట్రావ్, నాయకులు బద్రి, బి.వెంకటేశ్వరరావు, ఎపిఎంపిఎ జిల్లా అధ్యక్షుడు బొడ్డు విజయ్ బాబు, ఉపాధ్యక్షుడు మరకాల గోపితో 25 మంది వరకూ జర్నలిస్టులు పాల్గొన్నారు.

అమ్రిత సాయిలో ఫ్రెషర్స్ డే సంబరాలు



ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థులు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల పరిధిలో గల అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే వేడుకలను కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ కె.రామ మోహన్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.శశిధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామ మోహన్ రావు మాట్లాడుతూ సీనియర్స్, జూనియర్స్ స్నేహపూర్వకంగా మెలగాలని, జూనియర్స్ మొదటి సంవత్సరంలోనే మంచి ప్రణాళికతో నాలుగు సంవత్సరాల కోర్సులో విజయం సాధించటానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు టెక్నికల్‌గా అభివృద్ధి చెంది ఆధునిక సాంకేతి కతను పెంపొందించు కోవడానికి అమ్రిత సాయి సరైన వేదిక అని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శశిధర్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో ఏర్పాటు చేసిన స్టూడెంట్స్ క్లబ్స్ ద్వారా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. సీనియర్స్, జూనియర్స్ సాంప్రదాయ నృత్యాలను, నాటికలను, పలు చలన చిత్రాల గీతాలను, పాటలను ఆలపించి ప్రదర్శించారు. ముఖ్యంగా రీమిక్స్ సాంగ్స్‌కు విద్యార్థులు ఉత్సాహంతో కేరింతలతో స్టెప్స్ వేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ ఎం.శ్రీదేవి, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ఎక్ఛేంజ్ , లోన్ మేళా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీరామ్ గ్రూప్ ఫ్లాగ్‌షిప్ కంపెనీ, నగరంలోని పివిపి స్క్వేర్‌లో ఆన్-గ్రౌండ్ టూ-వీలర్ ఎక్స్ఛేంజ్‌లో లోన్‌మేళాను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి ఓ.ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. హీరో, సుజుకి, టివిఎస్ యమహా, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి ఒఇఎంలు ఈ ఎక్స్ఛేంజ్, లోన్ మేళా కోసం శ్రీరామ్ ఫైనాన్స్‌తో భాగస్వామ్యం చేసుకున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహన రుణాలను వినియోగదారులకు సౌకర్యవంతంగా, సమర్థవంతంగా సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి ఈ పండుగ సీజన్‌లో వారి కలల ద్విచక్ర వాహన కొనుగోలు ప్రక్రియను సులభతరం చేయడానికి ఈ మేళా నిర్వహించబడిందని తెలిపారు.

వరద బాధితులకు వరుణ్ గ్రూప్ సాయం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఇటీవల వదరల కారణంగా తీవ్రంగా నష్టపోయిన వారికి బాధితులకు అండగా ఉండేందుకుగాను వరుణ్ మోటార్స్ ప్రయివేట్ లిమిటెడ్, వరుణ్ గ్రూప్ సంస్థ కోటి రూపాయలను అందచేసింది. శనివారం నగరంలోని హెూటల్ నోవాటెల్ నందు జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, శాసన సభ్యులు గద్దె రామమోహన్, బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా కోటి రూపాయల చెక్‌ను వరుణ్ గ్రూప్ ఛైర్మన్ ప్రభు కిషోర్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ దేవ్, వరుణ్ మోటార్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వి. సత్యనారాయణతో పాటు పలువరు వరుణ్ గ్రూప్ సంస్థ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

